ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 13 | సంచిక : 07 | మార్చి 2008

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

భీమవరం ............ 26-12-07
చించినాడ ........... 17-01-08
మలికిపురం ......... 21-01-08
తాడినాడ ............. 05-02-08

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-12-2007, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఆధ్యాత్మికజీవితంలోగాని, భౌతికజీవితంలోగాని అభివృద్ధి లోనికి రావాలంటే ముందు మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. మనం తిండి తిన్నా జీర్ణశక్తి సరిగా లేకపోతే రేణింపు ఉండదు అలాగే ఆత్మ విశ్వాసం లేనివారు సాధనచేసినా అభివృద్ధి కనబడదు. ఆత్మ విశ్వాసం లేకపోతే ఆత్మలాభం సాధ్యం కాదు. మీమీద మీరు విశ్వాసం పెంచుకోండి అని స్వామీజీ అనేవారు. మీమీద మీరు విశ్వాసం పెంచుకోకపోతే మీకు జ్ఞానం రాదు, భగవంతుడు తెలియబడడు. ఆత్మ విశ్వాసం ఉన్న వాడికి లోకంలో అందరూ స్నేహితులుగానే కనిపిస్తారు, ఆత్మవిశ్వాసం లేనివాడికి మిత్రులు కూడా విరోధులుగా కనిపిస్తారు, వాడి నీడను చూసి వాడికి భయం వేస్తుంది. అందుచేత మీరు, నేను, మనందరం ఆత్మవిశ్వాసం పెంచు కోవాలి, మన మనస్సు మనకు తీసుకొనివచ్చే కష్టాలు, మన మనస్సు మనకు తీసుకొనివచ్చే అరిష్టాలు ఇతరులు ఎవరూ తీసుకొనిరాలేరు. ఇతరులు ఎవరో కష్టపెడుతున్నారు అని మనం అనుకొంటాము గాని మన మనస్సే మనలను ఎక్కువ కష్టపెడుతుంది. మన మనస్సులో ఇష్టాలు, అయిష్టాలు ఉంటాయి, మనం ప్రయత్నం చేసినా వాటిని బయటకు గెంటలేక పోతున్నాము. మనస్సులో ఉన్న గుణాలు, దాని తాలుక ఆందోళన మనలను వెంటాడటం వలన మన లోపల శాంతి ఉన్నా అది మనచేతికి అందటం లేదు.

ఆకాశంలో తిరిగే పక్షులకు గూడులు ఉన్నాయి, నాకు ఆ గూడు కూడా లేదు అయినా నేను శాంతిగానే ఉన్నాను అంటాడు ఏసు. కొంత మంది అన్నీ ఉండి కూడా అశాంతిగా ఉంటారు, కొంతమందికి ఏమీ లేకపోయినా శాంతిగా ఉంటారు అదే క్రీస్తు చెప్పేమాట. ఆయన శాంతిగా

ఉండటమే కాదు, హద్దులు లేకుండా మానవజాతిని ప్రేమించాడు. ఆయన శరీరం శిలువ వేయబడింది. ఆయన ఏమీ పొరపాటు చేయకపోయినా, ఆయనకు శిక్ష వేస్తూ ఉంటే దానిని ప్రతిఘటించలేదు. ఆయన శరీరానికి శిలువ వేసిన తరువాత, ప్రాణం విడిచిపెట్టాక మూడవరోజున మరల సజీవుడై వచ్చాడు, అంటే శరీరానికి మరణం ఉన్నా లోపల ఉన్న వస్తువుకు మరణం లేదు అని నిరూపించాడు. ఏసుక్రీస్తును శిలువ వేసేటప్పుడు దేహబాధ భరించలేక ఓ ప్రభువా! నన్ను మరిచిపోయావా అన్నాడు ఏసు. మరల వెంటనే రెండవవాక్యంలో మరచి పోయావా అంటున్నాను ఏమిటి? నేను నాతండ్రి వేరుకాదు, ఆయన నేను ఒక్కటే అన్నాడు, అప్పడు ఆ చివరిఘడియలో అద్వైతానుభవాన్ని, అమృతానుభవాన్ని అందుకొన్నాడు ఏసు అన్నారు భగవాన్. భక్తుడు కంప్లైంట్ చెయ్యవచ్చు, జ్ఞానికి కంప్లైంట్ కూడా ఉండదు, వస్తువు తానై ఉన్నవాడు కంప్లైంట్ చెయ్యడు. బాహ్యంగా మనం ఎన్ని ఘనకార్యాలు సాధించినా అవి కాల ప్రవాహంలో కొట్టుకొనిపోయి, ఒక్క ముక్తి సుఖం మాత్రమే శాశ్వతంగా ఉంటుంది. ఏసుక్రీస్తు శరీరానికి ఎలా శిలువ వేసారో అలాగ దేహము నేను అనే తలంపుకు శిలువ వెయ్యాలి అన్నారు భగవాన్. దేహబుద్ధికి ఎవడైతే శిలువ వేసాడో, ఎవడైతే సాధనచేసి దేహబుద్ధిని తొలగించు కొన్నాడో వాడే మహాజ్ఞాని అవుతాడు.

మనకు నేను, నాది అనే రెండుతలంపులు బలీయంగా ఉన్నాయి. ఈ రెండుతలంపులు లేని బ్రహ్మపదార్థాన్ని తెలుసుకొనేవరకు ఆజన్మకాజన్మ ఈ రెండు తలంపులు మనలను వెంటాడుతూ ఉంటాయి. క్రీస్తు గొర్రెలను కాసాడు, కృష్ణుడు ఆవులను కాసాడు అంటే ఆ ఆవులు, గొర్రెలు మనమే. ఈ జీవకోటికి వాళ్ళు కాపలాదారులు. మందలోనుండి తప్పిపోయిన గొర్రె అంటే ఏసుకు బాగా ఇష్టం. మంచి మార్గాన్ని విడిచిపెట్టి చెడిపోయాడు, వాడిని ఎలా ఉద్ధరించాలి అని తన ప్రేమను, శాంతిని ఇచ్చి ఆ తప్పిపోయిన జీవుడిని రక్షించటానికి ప్రయత్నం చేసాడు, వాడే దేవుడు, వాడే దేవుని కుమారుడు. మనం తప్పిపోయిన వారిని వదిలేస్తాము, బాగాఉన్నవారి చుట్టూ తిరిగి భజన చేస్తాము, ఇదీ మనం నేర్చుకొన్నది. చైతన్యం ఒక్కటే. మనం నారాయణ అనవచ్చు, క్రైస్తవులు యెహోవా అనవచ్చు, ముస్లింలు అల్లా అనవచ్చు ఎలా పిలిచినా ఉన్న వస్తువు ఒక్కటే. ఆ వస్తువు హిందువులకు వేరు, క్రైస్తవులకు వేరు, ముస్లింలకు వేరు కాదు. ఉన్నది ఒక్కటే. ఆ వస్తువు హిందువులకు ఎంత నిజమో, క్రైస్తవులకు అంతే నిజం. దానిని రకరకాల పేర్లు పెట్టి పిలుస్తున్నారు. మతాలు వేరు, మార్గాలు వేరుకాని గమ్యం ఒక్కటే. సత్యవస్తువును ఎరుకలోనికి తెచ్చుకోకుండా ఎవడికీ సుఖం లేదు, శాంతి లేదు. మన హృదయంలో శాంతి ఉంది, దానిని మనం అందుకోకుండా మన మనస్సే అడ్డువస్తోంది అని మనకు తెలియటం లేదు. అసలు ఎల్‌కెజీ సబ్జక్టు కూడా మనకు తెలియటం లేదు. మన

అలవాట్లయొక్క వేగం వలన, మనస్సు వలన మన లోపలఉన్న సత్యవస్తువు మనకు తెలియటం లేదు అని అర్థం చేసుకోకుండా దానికి వారు కారణం, వీరు కారణం, మతాలు కారణం, కులాలు కారణం అంటున్నాము. ఈ దేశంలో కులాలు, మతాలు ఎక్కువ అయిపోయినాయి. అందుకే ఈ అశాంతి అంటారు. శాంతి అనేది బయటనుండి వచ్చేదికాదు, శాంతి లోపలనుండే వస్తుంది. కులాలతో సంబంధం లేకుండా అనేక సమాజాలు, దేశాలు ఉన్నాయి. మరి అక్కడ శాంతిగా ఉన్నారా అంటే శాంతిగా లేరు. ఏదో వంపు పెట్టుకొని ఈ అశాంతికి కులాలు, మతాలు కారణం అనుకొంటున్నారుకాని, వీటి అన్నింటికి మన మనస్సే కారణం, మన బుద్ధిపాడైపోయి మనం భ్రష్టులం అయిపోయాము అని తెలియక ఈ కులాలమీద, మతాలమీద ఆరోపిస్తున్నాము. మన బుద్ధిని బాగుచేసుకోకపోతే స్పష్టతరాదు. భగవంతుడు ఏమి చెప్పాడు అంటే నాకు ఇష్టమైన పనులు చేస్తూ ఉంటే, నన్ను స్మరిస్తూ ఉంటే ఉన్న వస్తువును ఉన్నట్లుగా గ్రహించేబుద్ధిని మీకు ప్రసాదిస్తాను అని చెప్పాడు. జ్ఞానం సంపాదించటానికి జిజ్ఞాస ఉంటే సరిపోతుంది. చదువుకోవాలనే కాంక్ష ఉంటే బహుబీద కుటుంబంలో జన్మించినవారు కష్టపడి చదువుకొని సుప్రీంకోర్టు జడ్జీలు అయినవారు ఉన్నారు అంటే ఆ కృతనిశ్చయం ముందు వాళ్లకి బీదరకం అడ్డురాదు. ధనం ఉండటం, పేదరికం ఇవిఅన్నీ అవుట్‌సైడ్ గొడవలు. ఈ అవుట్‌సైడ్ గొడవలను చూసి అంతర్యామి మోసపోడు. ఆయన నీ ప్రవర్తన చూస్తాడు, నీ మనస్సు అణిగిందో లేదో చూస్తాడు, దాన ధర్మాలు మంచివే, వాటి వలననే నీకు ఆత్మసాక్షాత్కారం కాదు, ఇవి అన్నీ సెకండరీ, నీ మనస్సును, దేహాన్ని నియమించుకొని పునర్జన్మ కారణాలైన కామక్రోధముల నుండి విడుదల పొందటం వలన నీకు సాక్షాత్కారం కలుగుతుంది.

మనం ఎంతసేపు ఈ లోకాన్ని ఎంజాయ్‌చేయాలి అని చూస్తున్నాము. నీ ఇంద్రియాలు, మనస్సు ఎంజాయ్‌మెంట్ మీద ఉన్నాయి. మనకు పెర్‌ఫెక్షన్ గొడవలేదు. ఈ ఎంజాయ్‌మెంట్ అంతా భవిష్యత్‌లో దుఃఖంగా మారిపోతుంది అని తెలియకపోవటం వలన ఎంజాయ్‌చెయ్యాలి అనుకొంటున్నాము. ఎంజాయ్ చేసేది నీ మనస్సు. అది ఇలా ఎంజాయ్ చేసి, ఎంజాయ్ చేసి నరకలోకంలో కూరుకొనిపోయేలాగ చేస్తుంది. నేను లోపల ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, ఎక్కడో వైకుంఠంలో దేవుడు ఉన్నాడు అని ఈ బేదబుద్ధిని కల్పించేది మనస్సే. మనస్సు అణగితే అంతా నీవే, నీకు భిన్నంగా ఏదీ లేదు, ద్వైతభావన ఉండదు. ద్వైతభావన ఎప్పుడైతే వచ్చిందో నీకు భయం వస్తుంది, అసూయ వస్తుంది, కోరిక వస్తుంది, సర్వ అరిష్టాలకు ద్వైత భావనే కారణం. మా కుటుంబ పరిస్థితులు బాగాలేదు, మాకు దుఃఖంగా ఉంది అని ఎవరైనా భగవాన్‌తో అంటే కుటుంబ పరిస్థితులు బాగాలేకపోవటం, మీకు దుఃఖం రావటం ఇవి అన్నీ కలిసి మీ మొఖాన్ని భగవంతుడివైపుకు తిప్పితే అంతవరకూ అవి అన్నీ మంచివే కదా అన్నారు.

దుఃఖం, దారిద్ర్యం కూడా చెడ్డవికాదు, అవి కొన్ని పాఠాలు నేర్పుతాయి. నీ సంసారపరిస్థితులు బాగుంటే అది మంచికల, సంసారపరిస్థితులు బాగాలేకపోతే అది చెడ్డకల, ఇది అంతా స్వప్న సమానము. భగవంతుడిని నేను తెలుసుకోవాలి, నేను తెలుసుకోవాలి అంటే ఆయన తెలియబడడు. ఆయన నీకంటే తెలివైనవాడు. నువ్వు కించజ్ఞుడవు, ఆయన సర్వజ్ఞుడు. ఆయన ఎవరికి తెలియబడాలి అనుకొంటాడో వాడికి మాత్రమే తెలియబడతాడు. నువ్వు అనుకొన్నంత మాత్రంచేత ఆయన తెలియబడడు, నీ కోరిక వల్ల ఆయన తెలియబడడు, ఆయన తెలియబడాలి అనుకొంటే నీ కోరికతో సంబంధం లేకుండా తెలియబడతాడు. చిన్నతనంనుండి నీవు సాధన చేసుకోవాలి. చిన్నతనం నుండి సాధన చేసుకొంటే నీకు స్టేండర్డ్ బాగుంటుంది. సత్వగుణం ఉన్నవాడే ఎక్కువ సత్కర్మ చేయగలడు. రజోగుణం ఉన్నవాడు, తమోగుణం ఉన్నవాడు ఏదైనా మంచిపనిచేసినా ఇచ్చినవాడు సుఖపడడు, తీసుకొన్నవాడు సుఖపడడు. అవినీతిలేని అభివృద్ధి వలన సుఖపడతారు గాని అవినీతితో కూడిన అభివృద్ధి వలన ఎవరూ సుఖపడరు, వారికి శాంతిలేదు, ఆనందం లేదు ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. ఎవరో మనలను బాధపెడుతున్నారు అని ఇతరులమీద పెడతాముగాని మన అజ్ఞానమే మనకు ఎక్కువ క్షోభను తీసుకొనివస్తుంది.

కొంతమందికి ఈశ్వరుడిపట్ల సజీవమైన విశ్వాసం ఉంటుంది. ప్రహ్లాదుడు, ధృవుడు ఇటువంటివారు. ఎవడికైతే ఈశ్వరుడిపట్ల సజీవమైన విశ్వాసం ఉందో, ఈ పుస్తకం నా చేతిలో ఎలా ఉందో వాడు ఈశ్వరుడి చేతిలో పనిముట్టుకింద ఉంటాడు. భగవంతుడు ఏమని చెప్పాడు అంటే నీ మనస్సును, నీ బుద్ధిని నువ్వు బాగుచేసుకో. అది జ్ఞానమార్గం. నువ్వు బాగుచేసుకోలేకపోతున్నావు అనుకో అది నాకు ఇచ్చేయి అంటే నీ బుద్ధిని, నీ మనస్సును నాకు ఇచ్చేయి నేను బాగుచేసి పెడతాను, అది శరణాగతి మార్గం. మనం అదీ చేయటంలేదు, ఇదీ చేయటం లేదు. మనం బాగుచేసుకోము, ఈశ్వరుడికి స్వాధీనం చెయ్యము, మన పరిస్థితి ఇలా ఉంది. నాకు పుష్పం సమర్పించు, పత్రం సమర్పించు, ఫలం సమర్పించు అని భగవంతుడు చెపుతాడు. ఎందుచేతనంటే ఇలా నేర్పితే ఎప్పటికైనా మన మనస్సును సమర్పించే అలవాటు వస్తుంది. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేనును తీసుకొని వెళ్ళి ఈశ్వరుని పాదాల దగ్గర ఉంచితే, నీ ఇష్టమే నా ఇష్టం, నీ సంకల్పమే నా సంకల్పం అని ఎప్పుడైతే స్థిరపడిందో అప్పుడు ముందు వాడికి దుఃఖం ఆరిపోతుంది, అశాంతి ఆరిపోతుంది. ఇక్కడ పెర్సన్ ఉంటే పెర్సనల్ ప్లెజర్ వస్తుంది, పెర్సన్ ఉన్నప్పుడు పెర్సనల్ పెయిన్ వస్తుంది. ఎవడైతే దైవాన్ని అనుభవంలోనికి తెచ్చుకొన్నాడో వాడికి పెర్సనల్ పెయిన్ ఉండదు, పెర్సనల్ ప్లెజర్ ఉండదు ఎందుచేతనంటే అక్కడ పెర్సన్ పత్తా లేకుండా పోతాడు. నిద్రలోనుండి జాగ్రదవస్థలోనికి వచ్చేటప్పటికి మనకు మెలకువ ఎలా వస్తుందో అలాగ మీరు ఏదిగా ఉన్నారో దానిలోకి మెలకువ

రావాలి. అదే నిజమైన పుట్టినరోజు. ఇప్పడు మనవి దొంగచావులు, దొంగపుట్టుకలు. నేను పుట్టాను అనుకొనే వాడు చనిపోతాడు, నేను చనిపోతున్నాను అనుకొనే వాడు పుడతాడు. ఈ రెండింటితో సంబంధం లేని సద్వస్తువు ఒకటి ఉంది. ఆ సద్వస్తువు మీకు ఎరుకలోనికి వస్తే దానికి చావులేదు, పుట్టుకలేదు కాబట్టి మీరు మరణంలేని స్థితిని పొందుతారు, అమృతానుభవాన్ని పొందుతారు.

మనకు ఎప్పడైనా రోగం వస్తుంది, తగ్గిపోతుంది, దాటిపోయాము అనుకొంటాము. ఇలా ఎన్నిసార్లు దాటిపోయినా ఏదో రోజున ఈ దేహం దహించబడవలసిందే. రోజూ వెన్నపూస, పెరుగు వేసుకొని అన్నం తిన్నా, మీరు పది అంతస్థుల మేడలో ఉన్నా ఈ దేహం దహించ బడవలసిందే ఎందుచేతనంటే దహింపబడటానికే ఈ దేహం వచ్చింది. అసలు మనం మనస్సును ఎనాలసిస్ చేయటం లేదు. మన అశాంతికి, దుఃఖానికి మన మనస్సే కారణం అన్న సంగతి మనకు తెలియటం లేదు, అది తెలిస్తే అందులోనుండి బయటకు రావటానికి ప్రయత్నం చేస్తాము. నీవు ఎన్ని వేదాలు చదివినా, శాస్త్రాలు చదివినా, యజ్ఞయాగాదులు చేసినా వీటన్నిటి సారాంశం ఏమిటి అంటే నీ మనస్సును స్వాధీనం చేసుకో, నీ మనస్సును స్నేహితుడిగా చేసుకొని దానిని అదుపులో పెట్టుకొని దానికి లోచూపు నేర్పు అని చెపుతున్నాయి. నువ్వు ఆపని చెయ్యటం మానేసి ఎన్నాళ్ళు చదువుతావు, ఇంక చదవటమే పనా. చదువవలెను, చదువవలెను చావులేని చదువు చదువవలెను అని ప్రహ్లాదుడు చెప్పాడు. అంటే అమృతానుభవం పొందే చదువు చదవాలి. ఏ వస్తువుకైతే చావులేదో దానిని ఎరుకలోనికి తెచ్చుకోవటమే నిజమైన చదువు. తలంపు లేకుండా మాటరాదు, తలంపులేకుండా పని ఉండదు. ముందు తలంపు వచ్చాక మాట వస్తుంది, తలంపు వచ్చాక పని చేస్తాము. అందుచేత ముందు నీవు చేయవలసింది ఏమిటి అంటే ఆ తలంపులను పరమపవిత్రంగా కాపాడుకో. నీకు వచ్చే తలంపులు పరమపవిత్రంగా ఉండేటట్లు నువ్వు చూసుకోగలిగితే అప్పడు మాట పవిత్రంగా ఉంటుంది, చేత పవిత్రంగా ఉంటుంది. నువ్వు సుఖపడతావు, నువ్వు ఏదైనా సత్కర్మ చేస్తే నీ ద్వారా వారు సుఖపడతారు. పరమపవిత్రుడు అయిన వాడికే ఈశ్వరుడు గోచరిస్తాడు. క్రిష్టమస్ రోజున మనం నేర్చుకోవలసింది ఏమిటి అంటే ఏసుక్రీస్తు శరీరాన్ని ఎలా శిలువ వేసారో అలాగ మన దేహాభిమానాన్ని, శవబుద్ధిని శిలువవేయాలి. అప్పడు వాడు మహాజ్ఞాని అవుతాడు. దేహాన్ని శిలువవేయటం కాదు, దేహబుద్ధిని శిలువవేయాలి అదీ క్రిష్టమస్ సందేశం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-01-2008, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఎవరినైనా ప్రేమించాలంటే మనలో ప్రేమ ఉంటే ఎవరినైనా ప్రేమించగలము.

మనలో ప్రేమ లేనప్పుడు ఎవరినీ ప్రేమించలేము. ప్రేమించటం అనేది చిన్న విషయం కాదు. మీరందరు భగవంతుడిని ప్రేమించండి అంటే మీరు ప్రేమించలేరు. మీలో ప్రేమ ఉంటే కదా, లేనిదానికి మీరు ఏమి చేస్తారు. ప్రతీ జీవుడిలో అంతర్యామిగా పరమాత్మ ఉన్నాడు. అందుచేత జీవుడికి మనం ఎంతోకొంత సేవచేయగలిగితే అది లోపలఉన్న పరమాత్మకు అందుతుంది. ఈశ్వరుడిపట్ల ప్రేమలేకపోతే, భక్తి లేకపోతే మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం ఉన్నా మనం తరించలేము, మాయలో నుండి బయటకు రాలేము. మీరు ఏమతంలో ఉన్నా, ఏ దేవుడిని ఆరాధించినా ప్రకృతిని దాటకుండా ఆత్మజ్ఞానం కలుగదు. ప్రకృతి అంటే గాలి, నీరు, నిప్పు అనికాదు, ప్రకృతి అంటే తమోగుణం, రజోగుణం, సత్వగుణం. ఈ మూడు గుణాలు దాటాలి. సమాజంలో ఎప్పడూ ద్వంద్వాలు ఉంటాయి. రాగద్వేషాలు, సుఖదుఃఖాలు, ఇష్టాలు అయిష్టాలు ఇవి అన్నీ ఉంటాయి. సమాజం ఇలా ఉంది ఏమిటి అని అనుకోకూడదు, అది సహజం. లోకం మనలను ఉద్రేకపరస్తూ ఉంటే మనం ఉద్రేకపడకూడదు. మనం ఇతరులను ఉద్రేక పరచకూడదు. ఎవరిని చూసి మనం భయపడకూడదు, మనం ఎవరిని భయపెట్టకూడదు. ఇది భక్తుడికి ముఖ్యమైన లక్షణం. మంచి చెడూ లేకుండా సమాజం ఉండదు. ప్రపంచం అంతా ద్వంద్వాలతో కూడుకొని ఉంటుంది. మనం అందులో కలిసిపోతే పతనమవుతాము. ఆ ద్వంద్వాల నుండి బయటకురాకపోతే కోటిజన్మలు ఎత్తినా మీకు మోక్షం రాదు. మీరు సబ్జెక్టు అర్థం చేసుకోరు అనుకోండి, మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేయదు అనుకోండి, మీరు కోటి మంచిపనులు చేసినా మీకు ఆత్మజ్ఞానం రాదు.

మీరు విరోధుల దగ్గర ఎంత జాగ్రత్తగా ఉంటారో మీ స్నేహితుల దగ్గర అంతకంటే ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. సహవాసం విషయంలో చాలా జాగ్రత్త అవసరం. మనం ఎవరితో అయితే స్నేహం చేస్తున్నామో వారి గుణాలు మనకు వచ్చి తీరతాయి, మీరు పూజలు జపాలు చేస్తున్నా కూడా వారి గుణాలు వచ్చి తీరతాయి. మనకు అన్నీ ఉంటాయి కాని సుఖం కోసం, శాంతి కోసం కరువాసిపోయి ఉంటాము. నేను 64 విద్యలలో పండితుడను అయినా నాకు సుఖం, శాంతి దొరకటం లేదు, దుఃఖం విడిచిపెట్టటం లేదు అని నారదుడు సనత్‌కుమారుడిని అడుగుతాడు. ఏ వస్తువులో అయితే సుఖం, శాంతి ఉందో అక్కడ నుండే మనం వచ్చాము, మరల ఆ వస్తువులో చేరేవరకు అశాంతి, దుఃఖం నిన్నేకాదు, ప్రతీ జీవుడిని వెంటాడుతుంది. ఏ చైతన్యంలో అయితే ఆనందం ఉందో దానిని తెలుసుకోవటం మానేసి మిగతావి అన్నీ తెలుసుకొంటున్నాము. ప్రకృతితో సంబంధం లేకుండా, దేశకాలములకు అతీతంగా ఏ వస్తువు అయితే ఉందో అది నీకు అనుభవంలోనికి వచ్చేవరకు నిన్ను దుఃఖం విడిచిపెట్టదు అని అప్పడు ఆత్మవిద్యను నారదుడికి బోధించాడు. మనం ఎక్కడ నుండి వచ్చామో దానిని మర్చిపోవటం

వలన మనకు భక్తిరావటం లేదు. ఎవరైనా చెప్పినా కూడా మనకు భక్తి కుదరటంలేదు. భక్తి అంటే సామాన్యంకాదు, కష్టపడి మనం భక్తిని సంపాదించుకోవాలి. ప్రకృతిని ఎప్పుడూ అనుకరించవద్దు. ప్రకృతి కుక్కతోక వంటిది. నీ నిదానంలో నీవు ఉండు. భగవంతుడి వాక్యాన్ని ప్రమాణంగా తీసుకో. దేవతలు అమృతాన్ని తాగారు అని పురాణాలలో చెపుతారు కదా, అది అమృతం కాదు, భగవద్గీత అమృతం. ఆ అమృతం తాగినవాడికి శరీరానికి చావురాదు, చాలాకాలం ఉంటారు, సుఖం శాంతి లేనప్పడు శరీరాన్ని ఏమి చేసుకొంటారు. భగవద్గీతను అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, ఆ రకంగా మనం జీవిస్తూ ఉంటే శాశ్వతమైన ఆనందాన్ని, శాంతిని పొందుతారు. సత్పురుషుల సహవాసం, సద్గ్రంథపఠనం ఇవి అన్నీ మన మనస్సును బాగుచేసుకోవటానికే. మనం సుఖపడాలంటే ఆసక్తి, మమత ఈ రెండూ తగ్గించుకోవాలి. కర్మ సన్యాసం కంటే కర్మయోగం మంచిది. పనిని పూర్తిగా విడిచిపెట్టేయటం కంటే పనిచేసుకొంటూ దానివలన వచ్చే ఫలితాన్ని సమాజానికి అర్పిస్తే దానివలన నీవు యోగివి అవుతావు. పని మానేస్తే నీవు యోగివి అవ్వవు, బూడిద అవుతావు. మా దేవుడు కృష్ణుడు, ఆయన వేసుకొన్న బట్టలను బట్టి భోగదేవుడు అనిపిస్తాడు కాని లోపల ఆయన యోగదేవుడు అన్నాడు శ్రీకృష్ణచైతన్య. మనం లోపల కుళ్ళు పెట్టుకొని బయటకు గొప్పగా కనిపిస్తాము. మా దేవుడు బయట భోగిగా కనిపిస్తున్నాడు కాని లోపల ఉన్నదంతా యోగమే. వాడు దేవుడు.

ఈ శరీరం చనిపోయాక జీవుడు ప్రయాణం చేస్తాడు. వాడిని ఇప్పడు బాగుచేసుకొని, వాడిని పవిత్రుడిని చేసుకొంటే ఇంక మనకు పునర్జన్మ లేదు. మనకు జన్మ వచ్చింది అంటే లోకం వచ్చేస్తుంది, లోకం వచ్చిందా ఇంక మనం జ్ఞానం గొడవ మర్చిపోయి మాయలో పడిపోతాము, రాగద్వేషాలు వచ్చేస్తాయి. మనస్సును అతిక్రమిస్తే గాని మనం జన్మరాహిత్యస్థితిని పొందలేము. మన హృదయంలో దేవుడు ఉన్నాడు. ఎక్కడైతే దేవుడు ఉన్నాడో అక్కడ నీ మనస్సును ఉంచగలిగితే ఆయన దయకు పాత్రుడవుతావు. ఎప్పడైతే ఆయన దయకు పాత్రుడయ్యావో అప్పడు ఆయన నిన్ను లోపలకు గుంజుకొని, జీవలక్షణాలను పోగొట్టి ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు, ఆయన సర్వసాక్షి, సర్వ సమర్థుడు. ఆత్మజ్ఞానమే నిజమైన ఐశ్వర్యం, తరగని ఐశ్వర్యం. విషం తాగితే ఆ శరీరమే పోతుందికాని విషయచింతన కొన్ని కోట్ల జన్మలకు బీజం వేస్తుంది. మీరు ఎన్ని సాధనలు చేసినా వైరాగ్యం లేకపోతే మనోనిగ్రహం రాదు. శవాన్ని తిట్టినా, పొగిడినా దానికి ఏమీ అనిపించదు అలాగే మనోనిగ్రహం ఉన్నవాడిని ఏమి అన్నా, ఏమి చేసిన వాడికి ఏమీ అనిపించదు. మనలను ఎవరైనా విమర్శించినా కంగారు పడకూడదు. విమర్శకు నూటికి నూరుపాళ్ళు అసూయే కారణం. ప్రపంచం ఎలా ఉంటుంది అంటే నీవు పాడైపోతే నిన్ను పట్టించుకోదు, బాగుపడితే అసూయపడుతుంది. పరిస్థితులు అనుకూలంగా

ఉన్నప్పుడు ఎలా ఉంటున్నావు, పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు ఎలా ఉంటున్నావు అని భగవంతుడు చూస్తాడు, మనం కోరుకొంటే ఆయన తెలియబడడు, ఆయన తెలియబడాలంటే మనకు తెలియబడతాడు. అడిగితే ఇచ్చేదికాదు, మనం ఫిట్ అయితే అడగకుండా ఇస్తాడు. మీరు కూర్చోవటం బ్రాహ్మణుల ఇంటిదగ్గర కూర్చొన్నారు, లోపల మీ మనస్సులో చేపల వాసన, దానివలన ప్రయోజనం ఏమిటి? మనందరిది కారణభక్తి. దేవుడి దగ్గరకు వెళ్లేటప్పటికి మీ కోరికే గుర్తుకువస్తుంది, మీ కోరికనే మీరు ధ్యానిస్తారు. మనస్సులో ఏ కోరికలు లేకపోతే వాడు వాంఛారహితుడైతే వాడికి తెలియకుండా వాడు శివుడు అవుతాడు. ఈ లోకంలో, పరలోకంలో ఉన్న భోగాల మీద వాడి మనస్సు ఉండదు. కాని వాడికి భగవంతుడి మీద భక్తి ఉంటుంది, వాడు పూజార్హుడు, వాడు నడుస్తున్న దేవుడు. మానవశరీరం ఎందుకు వచ్చిందో మనకు తెలియటం లేదు. మనకు డబ్బు విలువ తెలుస్తోంది కాని కాలం విలువ తెలియటం లేదు. రోజులు బాగా వెళ్లిపోతున్నాయి అని అనుకొంటున్నాము కాని చావు దగ్గరకు వస్తోంది అని మనకు తెలియటంలేదు. కాలం విలువ తెలిసినవారు బాగాసాధన చేస్తారు. తమోగుణం ఉన్నవాడికి సోమరితనం ఎక్కువ ఉంటుంది. వాడి పొట్టకు సరిపడ కూడా సంపాదించడు, వాడిని మనమే పోషించాలి. రజోగుణం ఉన్నవాడు సంపాదిస్తాడు కాని సమాజానికి ఉపయోగపడడు, వాడికి లోభిత్వం ఎక్కువ ఉంటుంది. సత్వగుణం ఉన్నవాడికి ఆత్మజ్ఞానం సంపాదించాలనే జిజ్ఞాస ఉంటుంది. ఆ మనిషి స్వభావం అలాంటిది, ఈ మనిషి స్వభావం ఇలాంటిది అనుకొంటాము కదా. ఈ గుణాలు అన్నీ కలిసి మనిషి స్వభావం ఏర్పడుతుంది. గుణాలతో ఉన్న స్వభావం ఏమి చేస్తుంది అంటే అంతర్యామిగా ఉన్న భగవంతుడి దగ్గరకు వెళ్లనివ్వదు, ఎంతసేపు మనస్సును బాహ్యముఖం చేసేస్తుంది కాని అంతర్ముఖం అవ్వనివ్వదు. ఎంతసేపు శవాల గొడవేగాని దానికి శివుడి గొడవ ఏమీ ఉండదు.

బ్రహ్మజ్ఞానం తెలిసేవరకు సుఖం కోసం, శాంతికోసం కరువాసి ఉంటాము, ప్రకృతి ప్రవాహంలో తిరుగుతూ ఉంటాము. ఏ మనిషిని చూసిన వాడి తోలువంక చూడక అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని చూస్తూ ఉంటే నీకు బాహ్యమైన ఆకర్షణలు ఉండవు, భగవంతుని తాలుక చింతన పెరుగుతూ ఉంటుంది. ఎవడైతే నాలో అందరిని చూస్తాడో, అందరిలో నన్ను చూస్తాడో వాడు సమదర్శి, వాడికి రెండోది ఉండదు, ద్వైతం లేనప్పుడు ఆకర్షణ లేదు. ప్రేమ కూడా రెండవ పక్షం. అందరిలో నిన్నే చూసుకొంటూ ఉంటే ఇంక ప్రేమించటం ఏమిటి? అందరిలోను తనని తాను చూసుకొంటున్నప్పుడు తనని తాను ఏమి ప్రేమించు కొంటాడు. సబ్జక్టు చెప్పటంలో చిటారుకొమ్మ. ద్వితీయం లేనప్పుడు ప్రేమ ఏమిటి? మీ భగవాన్ మాటలు తిరకాసుగా ఉంటాయి అని కొంతమంది అంటారు. వారు మంచి వారే ఆ

మాటలను అందుకోలేక అలాగ అంటారు. మనం నోటితో ఏ మాటలు అయితే చెప్పకొంటున్నామో అవి మనకు అనుభవంలోనికి వస్తే అది కడసారి జన్మ. కోరటానికి, చూడటానికి, వినటానికి ఏమీలేదు అనేవారు భగవాన్. జ్ఞాని ఒక్కటే చూస్తాడు. ఆయనకు ద్వితీయం లేదు. ప్రపంచంలో ఏ సంఘటన జరిగినా ఆయన అబ్బురపడలేదు, ఆశ్చర్యపడలేదు, ఆయన భగవాన్. వాంఛింపబడింది లేదు, ఆశ్చర్యపడింది లేదు, వాడు గుణాతీతుడు. భగవంతుడు అచ్యుతుడు. మన మనస్సు ఎట్టి పరిస్థితులలోను చ్యుతి కాకుండా చూసుకొంటే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. ఈ సృష్టికి ఆధారం ఆయనే. మనం ఈ సృష్టిని చూస్తున్నాము కాని ఆధారంగా ఉన్న వస్తువును చూడలేక పోతున్నాము. భగవద్గీతను ఈ సృష్టికి ఆధారంగా ఉన్నవాడు చెప్పాడు. అందుచేత ఆయన మాటలను మనం శ్రవణం చేస్తే, ఆ మాటలను మననం చేసుకొంటే, ఆ ప్రకారం మనం జీవిస్తూ ఉంటే ఆయనను పొందుతాము. ఇంద్రియాల ద్వారా మనస్సు బయటకు పోతుంది. ఏ ఇంద్రియంద్వారా మనస్సు బయటకు పోతోందో చూసుకోండి. అక్కడ నుండి సాధన ప్రారంభించండి. సాధన లేకుండా సిద్ధి కలుగదు. కొంతమంది భక్తులు ఎలా ఉంటారు అంటే వారి గమ్యం భగవంతుడే, సాధన కూడా భగవంతుడే.

మనం గుడికి వెళ్లినప్పడు ఒకోసారి చెక్కరపొంగలి, ఒకోసారి పులిహోర, ఒకోసారి దద్దోజనం పంచిపెడతారు. అన్నీ ప్రసాదాలే, అన్నీ తింటాము. మీరు వెళ్లే సమయాన్ని బట్టి ఆ ప్రసాదం దొరుకుతుంది. అలాగే జీవితంలో కష్టాలు, సుఖాలు వస్తూ ఉంటాయి. చెక్కరపొంగలి అయినా, పులిహోర అయినా, దద్దోజనం అయినా నీవు ప్రసాదంగా ఎలా తీసుకొంటున్నావో అలాగ జీవితంలో వచ్చే కష్టాలను, సుఖాలను నీవు ప్రసాదంగా తీసుకొంటే ఆయన అనుగ్రహానికి పాత్రుడవుతావు. ఆయన అనుగ్రహం లేకుండా మాయ దారి ఇవ్వదు. పై నుండి కిందకు దిగాలంటే మనం ఏదో ఒక స్థంబాన్ని సపోర్టుగా చేసుకొని కిందకు దిగుతాము అలాగే హృదయంలో దిగటానికి బయట ఉన్న దేవతలను, అవతారపురుషులను సపోర్టుగా తీసుకోవాలి. హృదయంలో ఉన్న బంగారం మనకు దొరికింది అనుకోండి ఇంక మనం దేనిని పట్టుకోనవసరం లేదు. ఆ బంగారం దొరికే వరకు బాహ్యంగా ఉన్న దేవతల సపోర్టు కోసం వారిని ఆరాధిస్తాము. మీరాభాయికి బంధువులద్వారా, సమాజంద్వారా అనేక విమర్శలు వచ్చినా కాని ఎప్పడు భయపడలేదు. భయస్థులకు, బద్ధకస్తులకు ఆత్మజ్ఞానం కలుగదు. దానం చేసేటప్పడు వ్యక్తిని చూడకూడదు, అంతర్యామిని చూసిచేయాలి. వాడిలో అంతర్యామిగా ఉన్నది ఈశ్వరుడు, నీలో ఉన్నదీ ఈశ్వరుడే అంటే నీకు నీవే ఇచ్చుకొంటున్నావు అప్పడు ఇతరులకు ఇచ్చామన్న భావన పోతుంది, రజోగుణం తగ్గిపోతుంది. నీవు ఏది చేసినా సాత్వికమనస్సుతో చేయాలి, నీ భావన ప్రధానం, యజ్ఞభావనతో పనిచేయటం వలన నీకు తెలియకుండానే ధ్యానస్థితి వచ్చేస్తుంది.

శాస్త్రం అంటే శాసించేది శాస్త్రము. ఇది చేయదగినది, ఇది చేయకూడనిది అని నిరంకుశంగా చెపుతుంది. గీత ప్రకరణ గ్రంథం కాదు, శాసనం. అవునంటే అవును, కాదంటే కాదు. ఇది దైవీ లక్షణము, ఇది రాక్షస లక్షణము అని ఖండించి చెపుతాడు, అది గీతాశాస్త్రం. నాకు నచ్చలేదు అంటే నీకు నచ్చేటట్లు చేసుకోవాలి. కర్మయోగం కంటే కర్మసన్యాసం మంచిదేమో అని అడిగితే వాటిని ఖండించి అవతలపడేసాడు. గీత పొడుగునా అర్జునుడు అడుగుతూనే ఉంటాడు. కర్మసన్యాసం చెపితే యుద్ధం విడిచివెళ్ళిపోదామని, కృష్ణుడు వెళ్ళనిస్తాడా. కర్మ సన్యాసం చేస్తానంటావు ఏమిటి నీ పొట్టకోసం ఏదో పని చేయాలికదా, పని నుండి పారిపోవటానికి ఒప్పుకోలేదు.

జరాసంధుడు తరముకొని వస్తే కృష్ణుడు పారిపోయేవాడు. అంటే భగవంతుడు అవతారంలోనికి వచ్చినప్పుడు చట్టాన్నీ, ధర్మాన్ని గౌరవిస్తారు. జరాసంధుడి మరణం కృష్ణుడి చేతిలో లేదు, భీముడి చేతిలో ఉంది. ఆయన చంపలేకకాదు, ఆయనకు శక్తిలేకకాదు. చట్టాన్ని గౌరవించటం కోసం అలా చేసాడు. మనం అవతారపురుషులయొక్క అనుగ్రహానికి పాత్రులం అయ్యాము అనుకోండి మోక్షం ఇవ్వటమే. మీరాభాయి నిరంతరం కృష్ణుడిని చింతించటం వలన మనస్సు నశించింది. నిరంతరం రామచింతన వలన త్యాగరాజుకు మనస్సు నశించింది. భక్తిమార్గం ఎక్కడకు తీసుకొని వెళుతుందో, జ్ఞానమార్గం కూడా అక్కడకే తీసుకొని వెళు తుంది. మనం గ్రహించవలసింది ఏమిటి అంటే మనం ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఈ దొంగ నేనులో నుండి బయటకు రావాలి. మన కూడా కాముడు ఎంతకాలం అయితే ఉంటాడో అంతకాలం సంసారం ఉంటుంది. కాముడిని పట్టుకొంటే అశాంతి, అజ్ఞానం, సంసారం. రాముడిని పట్టుకొంటే శాంతి, జ్ఞానం, మోక్షం. ఈ సృష్టికి ఆధారంగా ఉన్నవాడు గోవిందుడు. గోవిందుడు తప్పించి ఏమీ లేదు. బంగారాన్ని నగను వేరు చేయలేము. గోవిందుడిని సృష్టిని వేరుచేయలేము. బంగారం లేకపోతే నగ లేదు. గోవిందుడు లేకపోతే సృష్టిలేదు. భగవదనుభవం ఎప్పుడైతే నీకు కలిగిందో భగవంతుడు ఒక్కడే నిజం, ఈ సృష్టి అంతా కల్పితం అని నీకు అనుభవంలోనికి వస్తుంది. ఆధారంగా ఉన్న వస్తువును వదిలేసి ఈ బొమ్మలను వేసుకొని తిరుగుతున్నాము. ప్రతీ మనిషిని బంధించేవి నామరూపాలు. ఈ నామరూపముల నుండి ఎప్పుడైతే విడుదల పొందామో అప్పుడు ఉన్న వస్తువు ఉన్నట్లుగా మనకు వ్యక్తమవుతుంది. గీత చదువుతున్నారు అనుకోండి, అర్థం కావటం లేదు అని దానిని వదలకూడదు, పట్టుకొని వేలాడాలి. అప్పుడు భగవంతుడు ఏమి చేస్తాడు అంటే అయ్యో వీళ్ళు చదువుతున్నారు కాని వీళ్ళకు అర్థం అవ్వటం లేదు అని మనకు అర్థం చేసుకొనే బుద్ధిని ఆయన ప్రసాదిస్తాడు. అందుచేత అర్థం అవ్వటంలేదని శాస్త్రాన్ని విడిచిపెట్టకూడదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-01-2008, మలికిపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన భారతదేశంలో జన్మించిన ముఖ్యమైన సిద్ధపురుషులలో షిరిడీసాయిబాబా ఒకరు. ఆయన తల్లితండ్రులు ఎవరో, ఆయన ఎక్కడ జన్మించాడో, ఆయన ఏ మతస్థుడో ఎవరికీ తెలియదు. ఆయనకు మతభేదం లేదు, కులభేదం లేదు, ప్రాంతీయ భేదం లేదు. భారతదేశం చాలా విశాలమైన దేశం. మన హృదయం అంత విశాలంగా ఉంటేనేగాని దేశాన్ని మనం ప్రేమించలేము. ముందు దైవభక్తి తరువాత దేశభక్తి ఈ రెండూ మనం మర్చిపోకూడదు. భగవంతుడు మనకు కేటాయించిన పనిని ఈశ్వరార్పణబుద్ధితో చేసుకొంటూ, మన దేహాన్ని, మనస్సును, ఇంద్రియాలను సర్వేశ్వరుడికి అర్పించి జీవిస్తూ ఉంటే మనకు మోక్షం వస్తుంది అంటే ఈశ్వరుడి స్వరూపాన్ని పొందుతాము. మేము ఎంత సుఖాన్ని అనుభవిస్తున్నా భగవంతుడి నామం మీద ప్రీతి పోవటంలేదు. మాకు బాహ్యంగా కోరుకోదగ్గ వస్తువులు లేవు, పొందదగిన వస్తువులు లేవు అయినప్పటికీ భగవంతుడి నామం మీద ఇష్టం పోవటం లేదు, మాది అకారణభక్తి అని కొంతమంది భక్తులు అంటారు. అది తెలిసినవారికి నామంలో అంతరుచి ఉంది. భగవంతుడు నిత్యకర్మయోగి. మనం అజాగ్రత్తగా ఉన్నా భగవంతుడు జాగ్రత్తగా ఉంటాడు. మనం నిద్రపోతున్నా మన నిద్రను చూస్తూ ఉంటాడు. భగవంతుడికి రూపంలేదు, నామంలేదు. మన నామరూపముల నుండి మనలను విడుదల చేయటంకోసం ఆయన ఒక రూపం ధరించి, పేరుపెట్టుకొని వస్తాడు. భగవంతుడి యొక్క కళ్యాణగుణాలు, ఆయన వైభవం మీకు తెలిస్తేగాని మీరు ప్రయత్నం చేసినా భక్తి కలుగదు అన్నాడు శ్రీకృష్ణచైతన్య.

ఆచార్యులవారు మూడు ఆత్మల గురించి చెప్పారు. గౌణాత్మ, మిధ్యాత్మ, సత్యాత్మ. గౌణం అంటే ఏమీ ప్రాధాన్యంలేని విషయం. గౌణాత్మ అంటే ఇంట్లో మీ మనవలకు జ్వరం వస్తే మనకే వచ్చేసింది అనుకొంటాము. నువ్వు డ్యూటీ చెయ్యాలికాని నాకే వచ్చేసింది అని దుఃఖపడుతూ ఉంటే నీకు దేహాభిమానం పెరిగిపోతుంది, నువ్వు సాధనకు పనికిరావు. అసలు మీరు భక్తికే పనికిరారు, బజారులో భక్తులని పిలువబడుతున్నారు. జ్ఞానం గురించి ఏడవటం మానేసి, మీ మనవడి గురించి ఏడుస్తారా, మీరు భక్తులా అన్నారు ఆచార్యులవారు. దేహము నేను అనే తలంపునే మిధ్యాత్మ అంటారు. మీకు ఎంత డబ్బు ఉన్నా, అధికారం ఉన్నా దేహము నేను అనే తలంపు ఉన్నంతకాలం జననమరణ ప్రవాహంలో నుండి బయటకు రాలేరు. నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాభిమానంలో నుండి బయటకురావాలి లేకపోతే ప్రయోజనం లేదు. మిధ్యానేను ఎక్కడ నుండి అయితే ఉదయించి వస్తోందో విచారణామార్గం ద్వారా దానిని అక్కడకు ప్రవేశపెట్టినా సరే లేకపోతే ఈశ్వరుడి పట్ల భక్తి వలన నీ మనస్సును హృదయంలో

ముంచినాసరే ఇలా ఏదో మార్గం ద్వారా నీ మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచితే అప్పడు మనస్సు నశిస్తుంది, నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. సాధన చెయ్యటం వలన సిద్ధి వస్తుంది గాని పాండిత్యంవలన, ధనం వలన, రచనలు చెయ్యటంవలన ఏదో పదిమందికి ఉపయోగ పడవచ్చునుగాని హృదయంలో మునిగే శక్తి నీకు లేకపోతే కోటిజన్మలు ఎత్తినా నీకు జ్ఞానంరాదు. ఈ లోకంలో ఉన్న భోగాల గురించిగాని, పరలోకంలో ఉన్న భోగాల గురించిగాని ఎవడికి ఆసక్తి లేదో, కోరిక లేదో వాడి మనస్సు మటుకే హృదయంలో మునుగుతుంది. మిగతా వారికి ఇది సాధ్యం కాదు. సత్యాత్మ అంటే భగవంతుడు. ఇది అంతటా ఉంటుంది, అన్ని కాలాలలో ఉంటుంది. సత్యాత్మను తెలుసుకొనేవరకు నువ్వు పునర్జన్మలలో నుండి, సంసారంలో నుండి బయటకు రాలేవు. హృదయంలో ఉన్న సత్యాత్మ ఎవరికైతే ఎరుకలోనికి వచ్చిందో వాడు ఈ శరీరం ఉండగానే శరీరం లేనివాడితో సమానము, వాడు అమృతుడు అవుతాడు.

దేహభావన ఉన్నవాడిని, జీవలక్షణాలు ఉన్నవాడిని ఏ జన్మకు ఆజన్మ ప్రియము, అప్రియము విడిచిపెట్టవు. ఉపనిషత్‌లలో చెప్పినమాటలు, భగవద్గీతలో చెప్పిన మాటలు విన్నా మనం నమ్మము. ఎందుచేతనంటే మన బుద్ధి మంచిదికాదు, జన్మాంతరంలో నుండి వచ్చిన వాసనలు మనలను నమ్మనివ్వవు. వారు 500 కోట్లు సంపాదించారు అని ఎవరైనా చెపుతూ ఉంటే ఆ మాటలు శ్రద్ధగా వింటాము. ఆ మాత్రం శ్రద్ధ కూడా భగవంతుడు చెప్పిన మాటలమీద ఉండదు. భగవద్గీతలో చెప్పిన మాటలు వింటే మీరు బాగుపడతారు. 500 కోట్లు సంపాదించిన వాడు దానిని వెయ్యికోట్లు ఎలా చెయ్యాలి అని చూస్తాడు కాని మీ క్షేమం వాడు చూడడు. కనీసం మీకు మంచినీళ్ళు కూడా ఇవ్వడు. వారి గురించి ఈ భక్తులు చెప్పకోవటం ఎందుచేతనంటే ధనం మీద ఉన్న అపేక్ష, ఆశ ఉండి ఇలా ఏడుస్తూ ఉంటారు. మీరు భగవంతుడి గురించి చెప్పకోవటం మానేసి వారి గురించి చెప్పకోవటం, పాడైపోవటం. మీరు భక్తులా అంటున్నారు ఆచార్యులవారు. ప్రియము అంటే కోరిక, ఎక్కడ ప్రియము ఉంటే మీ మనస్సు అక్కడకు పోతూఉంటుంది. మీ ఆయన అంటే మీకు బాగా ఇష్టం అనుకోండి, ఎందుకు ఇష్టం అంటే మిమ్మల్ని సుఖపెడుతున్నాడు కాబట్టి మీ ఆయన అంటే మీకు ఇష్టం, మిమ్మల్ని సుఖపెట్టటం మానేస్తాడు అనుకోండి, మీరు నెమ్మదిగా వాడికి మానసికంగా దూరమైపోతారు. వాడికి భార్య అంటే ఎందుకు ఇష్టం అంటే భార్య ద్వారా వాడు సుఖపడుతున్నాడు కాబట్టి భార్య అంటే ఇష్టం. వాడికోసం మీరు ఇష్టం, మీకోసం వాడు ఇష్టం, ఇదీ సంసారం అన్నారు ఆచార్యులవారు. అప్రియము అంటే క్రోధము, అప్రియము ఉన్నచోట కోపం ఉంటుంది. ప్రియము ఉన్నచోట కామం ఉంటుంది. దేహాత్మభావన ఉన్నవాడు కర్తృత్వం లేకుండా పని చేయలేడు అందుచేతవాడు పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం అనుభవించ వలసిందే. ఎవడైతే ఈ

శరీరం ఉండగానే సాధన చేసి అభ్యాస వైరాగ్యముల వలన కామక్రోధముల వేగాన్ని తగ్గించుకొన్నాడో వాడు మృత్యువును జయిస్తాడు. అంటే శరీరానికి మృత్యువు వచ్చినా తనకు మృత్యువు లేదనే అనుభవాన్ని పొందుతాడు. శరీరం ఉండగానే ఆ అనుభవాన్ని పొందినవాడు శరీరం ఉన్నప్పడు కూడా శరీరం లేనివాడితో సమానము.

భగవంతుడి దగ్గర ఉన్న జ్ఞానాన్ని, శాంతిని అడుగుతున్నాము కాని మనకు ఆయన మీద ప్రేమలేదు, ఇష్టంలేదు, భక్తిలేదు. మనం భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకొని జీవించాలి గాని ఎవరో అలా ఉన్నారు అని మనం కూడా అలాగ ఉండకూడదు. గురువు ముఖతః నేర్చుకొన్నది అధ్యయనం, మనంతట మనం చదువుకొంటే అదే చదువు. అధ్యయనం చేసినవాడికి వాక్కులో దోషం ఉండదు. అసలు శబ్దం ఉన్నది ఉన్నట్లుగా మనకు అర్థమవుతూ ఉంటే ఇలా కూర్చొన్న వాళ్ళు లేవకుండా జ్ఞానం వచ్చేస్తుంది. మనకు భక్తి ఉంటే ఆ మాట మన గుండెకు పడుతుంది. మనం ప్రజలను మోసం చేయగలము గాని భగవంతుడిని మోసం చేయలేము, ఎందుచేతనంటే ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు. భగవంతుడు ఆడించేవాడు, మనం ఆడేవాళ్ళము. ఈ శరీరం ఎప్పడు పోతుందో ఎవరూ చెప్పలేరు. ఆచార్యులవారు అన్నారు ఈ దేహంతోటి కాదు మూడు దేహాలలో దేనితో సంబంధం ఉన్నా జ్ఞానం రాదు అని చెప్పారు. 1. మాంసం, ఎముకలతో ఉన్నది స్థూలదేహం. 2. సూక్ష్మదేహం అంటే మనస్సు దీనిలో తలంపులు, కోరికలు అన్నీ ఉంటాయి. 3. ఈ స్థూల దేహానికి, సూక్ష్మ దేహానికి ఏదైతే కారణమో దానిని కారణదేహం అని అంటారు. అదే అజ్ఞానం. నీకు అజ్ఞానంతో తాదాత్మ్యం ఉన్నా, మనస్సుతో తాదాత్మ్యం ఉన్నా, స్థూలదేహంతో తాదాత్మ్యం ఉన్నా ఈ మూడు దేహాలలో ఒక్క దేహంతో తాదాత్మ్యం ఉంటే నీకు మోక్షం సున్నా అని ఆచార్యుల వారు చెప్పారు.

నేను 20 సం॥ల నుండి సాధన చేస్తున్నాను, ఆత్మ సత్యం, దేహం సత్యం కాదు అని అనుకొన్నా నా మనస్సు నిలబడటంలేదు, చివరకు దేహమే సత్యం అనిపిస్తోంది, నాకు ఏకాగ్రత రావటం లేదు అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. నువ్వు ఆత్మ సత్యం అని నోటితో అనుకొంటున్నావు కాని నీ మనస్సును ఆత్మపై పెట్టటం లేదు. మనస్సు ఇంద్రియాల ద్వారా బయటకు వచ్చేస్తోంది. ఒక్కొక్కరికి ఒకో ఇంద్రియం ద్వారా మనస్సు బయటకు వచ్చేస్తుంది, అది ఒక బలహీనత. మనం ఎన్ని ప్రవచనాలు విన్నా టి.వి మీద ఉన్న శ్రద్ధ మనకు భగవంతుడిమీద లేదు మనకు లోచూపు కలుగుతూ ఉంటే మన మనస్సులో ఏ వికారాలు ఉన్నాయో మనకు తెలుస్తుంది. మనకు అసలు అంతఃకరణశుద్ధి చేసుకోవాలనే ప్రయత్నమే లేదు. ప్రార్థనతో, విచారణతో, ధ్యానంతో మన అంతఃకరణాన్నిశుద్ధి చేసుకోవాలి అనే బుద్ధి మనకు రావటం లేదు. దమము, దయ, దానము ఉండాలి. దమము అంటే ఇంద్రియనిగ్రహం, తోటి మానవుడిపట్ల

దయ కలిగి ఉండాలి, ఎంతో కొంత దానబుద్ధి ఉండాలి. దూదికి అగ్గిపుల్ల అంటించితే అది ఎలా భస్మమయిపోతుందో ఈశ్వరానుగ్రహం వస్తే నీ బుద్ధిలో ఉన్న దోషాలు, బలహీనతలు, పాపరాశి ఎంత ఉన్నా అంతా కూడా కాలి బూడిద అయిపోతుంది. కనిపించే వాడు గురువు, కనిపించని వాడు దేవుడు. గురువు నీకు భోదిస్తాడు, ఆచరించే ప్రోత్సాహం ఇస్తాడు, నీలోని బలహీనతలు బయటకు తీయటానికి ప్రయత్నిస్తాడు, గురువు యొక్క అనుగ్రహం లేకుండా జ్ఞానం రానేరాదు. అట్టి గురువు మీద నీకు విశ్వాసం లేనప్పుడు, గౌరవం లేనప్పుడు కనిపించని దేవుడి మీద నీకు గౌరవం, భక్తి ఎలా కలుగుతుంది. నీ అబద్ధపు మాటలు, నీ బూటకాలు ఎవరు నమ్ముతారు. భక్తి మార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం ఇలా ఏదో ఒక మార్గంలో ప్రయాణించి మనం దేహాభిమానంలో నుండి బయటకు రావాలి. మనం ఏదైనా ఒక నామం చేసేటప్పుడు గౌరవంగా చేయాలి, గౌరవం లేకుండా నామం అనుకొంటే అది అపచారం, హృదయపూర్వకంగా మనస్సు అక్కడపెట్టి నామం చేసుకోవాలి. భగవంతుడి నామాన్ని మీరు ప్రేమగా, ప్రీతిగా చేస్తూ ఉంటే, ఆ నామం గలవాడికి నామానికి భేదం లేదు అని ఇష్టంతో మీరు నామం చేస్తూ ఉంటే అటువంటి భక్తి మీకు జ్ఞానమనే ఫలాన్ని ఇస్తుంది. మనం నోటితో భగవంతుడి నామాన్ని చెపుతాము కాని లోపల మన గుండె నమ్మదు. మాట, మనస్సు, దేహం ఇవి మూడు సమానంగా ఉండాలి. ఇవి మూడూ సమానంగా ఉంటే బుద్ధిలో ఉన్న వంకరలు పోతాయి. మనం చేసే సాధన అంతా మన అంతఃకరణాన్ని శుద్ధి చేసుకోవటానికే. అంతఃకరణం శుద్ధి అయితే అంతర్ దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి లేకుండా ఆత్మజ్ఞానం కలుగదు.

గాఢనిద్రలో ఎవరికి భయం లేదు. కాని జాగ్రదవస్థలో మనకు దేహం, లోకం కనిపించేటప్పటికి మనకంటే వాళ్ళందరు వేరు అనే ద్వైతభావన వచ్చేటప్పటికి భయం కలుగుతోంది. దేహాన్ని, లోకాన్ని చూసేవాడు ఎవడూ భయంలో నుండి విడుదలపొందలేడు. టి.వి.లు, సినిమాలు ఇచ్చే ఆనందం, ఆత్మ ఇవ్వలేదేమో అనుకొంటున్నాము అందుచేత వాటి కూడా తిరుగుతున్నాము. ఆత్మానందం తెలిసాక తెలుస్తుంది దానికి మించిన ఆనందం ఇంకోటి లేదు అని మనకు తెలుస్తుంది. మనం వట్టిగడ్డి తినటానికి అలవాటుపడ్డాము అంటే టివిలు ఇచ్చే ఆనందం. వట్టిగడ్డికి అలవాటు పడ్డ దూడలు పక్కన పచ్చగడ్డి పెడితే దానికి అలవాటు లేకపోతే అది తినదు. మనం ఒకరోజు దాని నోట్లో పెట్టి అలవాటు చేసాము అనుకోండి ఇంక వట్టిగడ్డి తినటం పూర్తిగా మానేస్తుంది. అలాగే ఆత్మానందం రుచి చూసాక ఇంక వాడికి విషయానందం మీదకు వెళ్ళదు. మనకు ఆత్మానందం రుచి చూపించేవాడే గురువు. నిరంతర కర్మయోగి మాత్రమే నిరంతర జాగరూకుడు. ఈశ్వరుడు నిరంతర కర్మయోగి. ఆయనకు పని చెయ్యవలసిన అవసరం లేకపోయినా పనిచేస్తున్నాడు. మనం అవసరం ఉండి కూడా పని

బద్ధకిస్తున్నాము. మనిషి తన బలహీనతల నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేసేటప్పుడు ఎంతోకొంత బాధ ఉంటుంది, అది తట్టుకొంటే మీరు సక్సెస్ అవుతారు, నీ మనస్సును జాగ్రత్తగా వాచ్ చెయ్యి. ఏ బలహీనత వలన ఏ ఇంద్రియం ద్వారా మనస్సు బయటకు వెళుతోందో చూసుకొని ఆ విషయంలో నుండి మనస్సును బయటకు లాగి డైరెక్టుగా ఆత్మమీద నిలబెట్టు, అలా చేయలేకపోతే నీ ఇష్టదైవాన్ని ఆరాధించగా, ఆరాధించగా మీకు భగవంతుడితో అనుసంధానం వస్తుంది. మీకు భగవంతుడితో అనుబంధం వచ్చాక మీ మనస్సులో ఉన్న వాసనలు మీకు తెలియకుండా రాలిపోతాయి. నీకు పూర్వపుణ్యం లేకపోతే సజ్జనసాంగత్యం కనుక లేకపోతే మన మనస్సును ఈశ్వరుడితో అనుసంధానం చేయాలనే బుద్ధి మనకు రాదు.

శంకరాచార్యులవారు కాశీలో మణికర్ణికా ఘాట్‌లో స్నానం చేసివస్తున్నారు, పద్మపాదుడు స్నానానికి వెళుతున్నాడు, వారిద్దరు ఒకరినొకరు చూసుకొన్నారు, స్నేహం కలిగింది, ఆ స్నేహం చనిపోయేవరకు అలాగే ఉంది, అది జన్మాంతర అనుబంధం. ఇప్పుడు శనివారం స్నేహాలు, ఆదివారం విరోధాలు. స్వార్థాన్ని కేంద్రంగా పెట్టుకొని స్నేహాలు చేస్తే ఆ స్నేహాలు ఎంతకాలం నిలబడతాయి. మన ఇంట్లో వారికి దేవుడిమీద నమ్మకం లేదు అనుకోండి. మన డ్యూటీ మనం చేయాలి కాని వారికి భక్తి లేదని మన భక్తిని పోగొట్టుకో కూడదు. నీకు భగవంతుడి మీద భక్తి ఉండాలి కాని కారణం కనబడకూడదు. కారణం కనిపిస్తే అది కారణభక్తి అవుతుంది, కారణభక్తి వలన కోరికలు నెరవేరతాయి కాని మోక్షం సున్న. ఈ లోకం ఎంత నిజమో, మీరు ఎంత నిజమో, నేను ఎంత నిజమో కోరికలు నెరవేరినా అంతే నిజం. నెరవేరిన కోరిక ఇంకో పది కోరికలను తీసుకొని వస్తుంది. ఒక కాకికి అన్నం పెడితే అది కావు కావు అని ఇంకో పది కాకులను పోగుచేసుకొని వస్తుంది. మనిషి అలాకాదు ఎవడికి పెట్టిన అన్నం వాడే తినేస్తాడు. భగవాన్ రంగన్‌తో ఏమన్నారు అంటే నువ్వు నా గురించి భగవాన్ అట్టివాడు, భగవాన్ ఇట్టివాడు, భగవాన్ జ్ఞాని అని చెపుతున్నావు, అటువంటి మాటలు చెప్పబోకు అన్నారు, నా గురించి యాగీ చెయ్యకు అన్నారు. అప్పుడు రంగన్ కాకులు చేసే పని కూడా నేను చెయ్యలేనా అన్నాడు. నీ దగ్గర పొందిన శాంతిని మిగతావారు కూడా అనుభవిస్తారు అని వాళ్లను పిలుస్తున్నాను అని చెప్పాడు. బలహీనతలను చూసి కంగారు పడవద్దు. సాధన చేస్తే అవి పోతాయి. మీకు ఏ అలవాటు ఉందో, ఆ అలవాటు లేనివారితో స్నేహం చేస్తే వారి ప్రభావం మీ మీద పడుతుంది, నెమ్మదిగా ఆ అలవాటు పోతుంది. ఈశ్వర ప్రీత్యర్థం నీవు పనిచేస్తూ ఉంటే, దేవుని వాక్యాలను మాట్లాడటానికే నీ నోరును ఉపయోగిస్తూ ఉంటే, ఈశ్వరుడి దేవాలయాల చుట్టూ నీ కాళ్ళు తిప్పుతూ ఉంటే, ఈశ్వరుడి యొక్క రూపాన్ని నీ నేత్రాలు అనుభవిస్తూ ఉంటే వీటివలన నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, బాహ్యంగా ఏమీ లేదు అని నీకు తెలుస్తుంది, చిత్తశుద్ధి అనే గేటు

ద్వారానే మనిషి మోక్షాన్ని పొందాలి, ఇంకో దారి లేదు.

కళ్ళు, చెవులు, నోరు వీటివలననే మీరు పాడైపోతున్నారు అని గాంధీగారు చెప్పారు. పాడుదృశ్యాలను చూడటం, పాడు మాటలను వినటం, పాడు మాటలను మాట్లాడటం ఈ మూడు ఇంద్రియాల వలన మీరు పాడైపోతున్నారు అన్న సంగతి కనీసం మీకు తెలియటం లేదు. ఈ మూడు ఇంద్రియాలను కంట్రోలు చేసుకోలేనప్పుడు మీకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. ఎందుకు బుడబుక్కల మాటలు చెపుతారు, ఎవరిని మోసం చేస్తారు. అందుకే గాంధీగారు మూడుకోతుల బొమ్మలు తయారుచేసారు. నాకు గురువు ఈ మూడు కోతుల బొమ్మే అని చెప్పారు. ఉన్న వస్తువు ఒక్కటే అదే ఇన్ని రూపాలు ధరించింది. మీరు చేయగలిగితే నిరంతరం ఆత్మచింతన చేయటం లేకపోతే నిరంతరం మీ ఇష్ట దైవం యొక్క నామాన్ని స్మరించుకోవటం, ఆయన రూపాన్ని ధ్యానించుకోవటం. కర్మయోగం వలన చిత్తశుద్ధి వస్తుంది, భక్తియోగం వలన ఏకాగ్రత, పవిత్రత వస్తుంది. వీటివలన ముముక్షత్వం వస్తుంది. ఆ జిజ్ఞాస ఎప్పుడైతే వచ్చిందో అప్పుడు ఇది రాత్రి, ఇది పగలు అని తెలియకుండా జ్ఞానం కోసం కృషి చేస్తారు. ఆత్మజ్ఞానం వలన మోక్షం వస్తుంది. కృష్ణుడు అంటే ఆకర్షించేవాడు. గోపికలను కృష్ణుడి దగ్గరకు వెళ్ళవద్దు అని చెప్పేవారు, వెళితే మీ బట్టలు లాగేస్తాడు అనేవారు. కృష్ణుడు బట్టలు లాగేయటం అంటే మీ పునర్జన్మకు కారణమైన వాసనలను లాగేస్తాడు. మీరు ఆయన ఆకర్షణలో పడితే గత జన్మలనుండి వస్తున్న వాసనలు, ఆ పాపరాశి ఎంత ఉన్నా దానిని భస్మం చేసి ఆయన స్వరూపాన్ని ఇస్తాడు, వాడు దేవాది దేవుడు. మేము భగవంతుడిని ప్రార్థిస్తున్నాము. మరి కోరికలు నెరవేరటం లేదు ఎందుకు అని భగవాన్‌ను అడుగుతున్నారు. మీ కోరికలు నెరవేరకపోవటం మంచిదే. నెరవేరితే భగవంతుడిని ప్రార్థించటం మానివేస్తారు. ఎంత లేటుగా మీ కోరికలు నెరవేరితే అంతవరకు మీరు భగవంతుడిని ప్రార్థిస్తూ ఉంటారుకదా, అది మంచిది కంగారుపడకండి అని చెప్పారు. అమృతానుభవం ఎప్పుడో పొందటం కాదు, ఇప్పుడే పొందు, ఇక్కడే పొందు, ఈ శరీరం ఉండగానే అశరీరస్థితికి రా.

నీ హృదయంలోనే అమృతం ఉంది. నీకు లోచూపు కలిగితే, ఎక్కడైతే పరమాత్మ ఉన్నాడో అక్కడకు నీ మనస్సును ఉపసంహరించగలిగితే అమృతత్వాన్ని ఇక్కడే పొందుతావు. నువ్వు కామక్రోధముల యొక్క వేగం తగ్గించుకొంటే, అన్ని అభిమానాల నుండి విడుదల పొందితే నీ మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది, అప్పుడుగాని నీకు ఆత్మజ్ఞానం కలుగదు. రాణి రాసమణిగారు రామకృష్ణపరమహంసకు ఉద్యోగం ఇచ్చారు. ఆవిడ పార్వతీ దేవి దగ్గరకు వచ్చి కోర్టులో తీర్పు తనకు అనుకూలంగా వచ్చేలా చేయమని మనస్సులో ప్రార్థించారు, అప్పుడు రామకృష్ణపరమహంసగారు రాణిగారిని లాగి లెంపకాయ కొట్టారు, ఏమిటి నీకు పరమాత్మ

దగ్గరకు వచ్చి కోర్టు గొడవలా, అమ్మవారి దగ్గరకు వచ్చి జ్ఞానం అడగాలి కాని కోర్టు గొడవలా అన్నాడు. ఉద్యోగం పోతుందేమో అనే గొడవ ఆయనకు లేదు. అక్కడ ఉన్నవారు వీడి ఉద్యోగం తీసేయండి, ఆరు నెలలు జైలులో వేయండి అన్నారు. అప్పుడు రాణి రాసమణి ఏమని చెప్పారు అంటే ఆయన మహాభక్తుడు, ఆయనను ఉద్యోగంలో నుండి తియ్యవద్దు. నేను అమ్మవారిని ధ్యానం చేయటంలేదు, నా కోరికలను ధ్యానం చేస్తున్నాను, నేను చేసింది తప్పు, ఇంక ఆయనను ఉద్యోగంలో నుండి తీసేస్తే మహాతప్పు అవుతుంది అని చెప్పి రామకృష్ణపరమహంసగారి భక్తికి సంతోషించి అక్కడ నుండి వెళ్ళిపోయింది. రాణిగారు చాలా మంచిది అభిమానం లేకుండా సహనంగా వెళ్ళిపోయింది. ఏమీలేనివాడు అణిగి ఉండటం వేరు, రాణిగారికి అధికారం ఉన్నా అణిగి ఉండేవారు అందుచేత రామకృష్ణపరమహంస గారికి ఆవిడ మీద ప్రీతి. రామకృష్ణుడు ఎక్కువగా ఆవిడ వినయం గురించి మాట్లాడేవారు, ఆవిడ శరీరం పోయిన ఆవిడ నామం ఆయన నోట్లో నలిగింది. ఇంక ఆవిడకు మోక్షం రాకుండా ఎలా ఉంటుంది. సత్పురుషులను మనం స్మరించుకోవటం కాదు వారు ఒక్కసారి మనలను స్మరించుకొంటే చాలు మనకు మోక్షం వస్తుంది. సజ్జన సాంగత్యం యొక్క వైభవం అది. భక్తులకు నామమే సొమ్ము. మనం ఇంటి దగ్గర పైసాలు లేకపోతే దరిద్రులం అని అనుకోకూడదు. భగవంతుడి నామమే మనకు ఐశ్వర్యం, ఆయనే జ్ఞానదాత, మోక్షదాత. మనకు భక్తి లేకపోతే, భగవంతుడి పట్ల గౌరవం లేకపోతే, ఆయన నామాన్ని నోటినిండా పలకలేకపోతే దరిద్రులం. ఉద్ధవుడు కృష్ణ భక్తుడు. నాకు అది కావాలి, నాకు ఇది కావాలి అని ఉద్ధవుడు ఎప్పుడూ అడగలేదు. నాకు జ్ఞానం కావాలి అని అడిగేవాడు. అందుకు భగవంతుడు ఎప్పుడూ ఆయనను విడిచిపెట్టలేదు. కాని ఎప్పుడైనా నేను భక్తుడను అనే అహంకారం ఉద్ధవుడికి వచ్చేది. వీడికంటే గోపికల భక్తి గొప్పది. ఉద్ధవా! నేను గోపికలను చూసి చాలాకాలం అయింది, కృష్ణుడు మిమ్మల్ని చూసి రమ్మన్నాడు అని నాకోసం నీవు వెళ్ళి చూసిరా అని కృష్ణుడు చెప్పాడు. ఉద్ధవుడు వెళ్ళి గోపికలను చూసాక వారి భక్తి ముందు నా భక్తి ఎందుకు పనికిరాదని తలవంచుకున్నాడు. ఆ భక్తిని నేర్పటానికే పరమాత్మ ఉద్ధవుడిని గోపికల దగ్గరకు పంపాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-02-2008, తాడినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవాన్ అందరినీ నిన్ను నీవు తెలుసుకో అంటున్నారు, మరి మేము ఎందుకు తెలుసుకోవాలి అని ఒక హేతువాది నన్ను అడిగారు. మీరు ఏమైనా డబ్బు సంపాదించుకొన్నారా అని నేను అడిగాను. సంపాదించుకొన్నాను అని చెప్పాడు. మీరు పెళ్ళి చేసుకొన్నారా అని అడిగితే చేసుకొన్నాను అని చెప్పాడు. ఏమైనా గౌరవం సంపాదించుకొన్నారా అని అడిగాను.

ఎక్కువలేదుగాని సరిపడగౌరవం సంపాదించుకొన్నాను అని చెప్పాడు. ఇవి అన్నీ ఎందుకు చేస్తున్నారు అని అడిగితే ఆయన మౌనంగా కూర్చొన్నారు. మనిషి అధికారం సంపాదించుకొన్నా, డబ్బు సంపాదించుకొన్నా, పెళ్ళి చేసుకొన్నా ఇవన్నీ దేనికంటే సుఖంకోసం, ఆనందంకోసం ఇవి అన్నీ చేస్తున్నాడు. అహంకారం ఉన్నవాడు తనపేరు పదిమందికి తెలియాలి అనుకొంటాడు, అది అహంకారం యొక్క స్వభావం. తేలు ఎందుకు కుడుతుంది, పాము ఎందుకు కరుస్తుంది అంటే అది వాటి యొక్క స్వభావం. అహంకారం ఉన్నవాడు ప్రతీవాడు అహంకారరహితంగా ఏపనీ చేయలేడు, అహంకార రహితంగా పనిచేస్తే వాడికి జ్ఞానమే వస్తుంది. నువ్వు డబ్బు ఎందుకు సంపాదిస్తున్నావో, పెళ్ళి ఎందుకు చేసుకొంటున్నావో, లక్షలు ఖర్చుపెట్టి అధికారం ఎందుకు సంపాదించుకొంటున్నావో అందుకోసమే నిన్ను నీవు తెలుసుకో అంటున్నారు. డబ్బు, అధికారం, పెళ్ళి ఇవి అన్నీ సుఖంకోసం, సంతోషంకోసం సంపాదించుకొంటున్నావు. కాని డబ్బు వలన, అధికారం వలన వచ్చే సంతోషం క్షణికం. నిన్ను నీవు తెలుసుకొంటే శాశ్వతమైన సుఖం, శాశ్వతమైన ఆనందం కలుగుతుంది. జీవితంలో ప్రతీదీ క్షణికం. అధికారం, డబ్బు, గౌరవం ఇవన్నీ ఎక్కడకు పోవు అనుకొంటాము కాని ఇవి అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొని పోతాయి. ఇవన్నీ కృత్రిమంగా తెచ్చిపెట్టుకున్నవి, ఇవన్నీ స్వప్నసమానము. నేను ఎవడను అనే ప్రశ్న అందరికీ రాదు. అనేక జన్మల నుండి మంచి బుద్ధి సంపాదించుకొన్నవారికి, మంచి సంస్కారం సంపాదించుకొన్నవారికి, మంచి పనులు చేసిన వారికి నేను ఎవడను అని తెలుసుకోవాలనే బుద్ధి కలుగుతుంది కాని అందరికీ ఆ బుద్ధి కలుగదు, మొట్టికాయలు మొట్టినా కలుగదు. నాలో ఒక నేను ఉంది, ఆ నేను నాకు తెలియకుండా నాకు సుఖం లేదు, శాంతి లేదు.

పూజలు, జపాలు గొడవ తరువాత చూద్దాము, ముందు సబ్జక్టు బాగా అర్థం చేసుకోండి. మీరు దేనికైనా బెంగ పెట్టుకొన్నారు అనుకోండి, నా మాటలు వింటున్నారు అనుకోండి, రెండు రోజులు శాంతిగా, చల్లగా ఉంటుంది కాని సత్యం మీకు తెలియదు. సత్యాన్వేషకుడికి మాత్రమే సత్యం తెలుస్తుంది. రాత్రి ఆచార్యులవారు నాకు స్వప్నదర్శనం ఇచ్చారు. బాలుడు, జంధ్యం వేసుకొన్నాడు, తెల్లబట్టలు వేసుకొన్నాడు, అనుగ్రహస్వరూపంగా ఉన్నారు, ఆయన మాట్లాడలేదు. స్వప్న దర్శనం ఇవ్వటం వలన పొంగుతున్న సముద్రం, ఒక్కసారి ఆగిపోతే ఎలా ఉంటుందో అలాగ నా మనస్సు ఆగిపోయింది. జాగ్రదవస్థలోనికి వచ్చాక కూడా నా మనస్సు ఆగిపోయింది. మనం ఏదైనా మంచి పని చేసి మర్చిపోయినా అది మనలను విడిచిపెట్టదు. ఎక్కడైనా మంచి మాట విని మర్చిపోయినా సమయం వచ్చినప్పుడు గుర్తుకువస్తుంది, మనం ప్రమాదంలో పడకుండా ఆ మాట మనలను కాపాడుతుంది. అందుచేత మంచి మాటలు విని ఉండటం మంచిది. ఒకవేళ మనం ఆచరించలేకపోయినా సడన్‌గా ప్రమాదం వచ్చినప్పుడు అది మనకు ఉపయోగపడుతుంది. మనిషి అయ్యాక ఎప్పుడైనా కోపం వస్తుంది. అయితే ఆ కోపం వలన

నువ్వు పాడైపోకూడదు. మన కోపం నీటిమీద గీతలా ఉండాలికాని నువ్వు వల్లకాటికి వెళ్ళే వరకు ఆ కోపాన్ని కాపాడుకోకూడదు. నీకు కోపం రాకూడదు అని నేను చెప్పినా ఎంతోకొంత కోపం రాకుండా నువ్వు ఉండలేవు, మనస్సు ఉన్నంతకాలం అది సహజం. ఎదుటివారి మీద దయ ఉండవచ్చు. అది ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండాలి కాని దయపేరు చెప్పి రోజూ నీ మనస్సును బయటకు తోలుకొనిపోతూ ఉంటే లోపల సున్న అయిపోతావు. నీ మనస్సుకు అంతర్దృష్టి కలుగదు, మనస్సుకు లోచూపు కలుగకుండా లోపల ఉన్న బ్రహ్మపదార్థం నీకు తెలియదు. నీకు బ్రహ్మపదార్థం తెలియనప్పడు మంచిని చెడ్డ అనుకొంటావు, మాయను జ్ఞానం అనుకొంటావు. నీకు మంచిగుణాలు ఉన్నాయి అని అక్కడికి సరిపెట్టుకొని జీవిస్తూ ఉంటే ఒక గోతిలో నుండి లేవటం ఇంకో గోతిలో పడటం, చనిపోవటం తిరిగి పుట్టటం ఈ ప్రయాణాలలో ఉంటావు. నువ్వు మంచిపనులు చేస్తే అందరూ మెచ్చుకొంటారు, ఊరేగింపులు ఉంటాయి అది నీ జీవిత ధ్యేయం కాదు, నువ్వు సత్యానుభవం పొందాలి, అదే జీవితగమ్యం, నువ్వు ఏదైనా పనిచేస్తే అహంకారరహితంగా చేయాలి. అహంకారరహితంగా పనిచేస్తూ ఉంటే అది సత్యాన్వేషణకు ఉపయోగపడుతుంది. అహంకారంతో పనిచేస్తే నీకు పుణ్యం రావచ్చుకాని అది అనుభవిస్తే వంతెనకింద నీరులాగ వెళ్ళిపోతుంది.

ప్రతీమనిషికి సుఖం కావాలి, శాంతి కావాలి, అది మన స్వరూపంలోనే ఉంది. మనమే ఆనందం, మనమే శాంతి, అది తెలియకపోవటం వలన సుఖంకోసం, శాంతికోసం బజారులో వెతుక్కొంటున్నాము. మనస్సుకు బాహ్యముఖానికి వెళ్ళిపోవటం అలవాటు. ఏదో వస్తువులో సుఖం ఉందని దానికోసం వెతుకుతుంది. అది సంపాదించాక అక్కడ సుఖం లేదని తెలుస్తుంది. నువ్వు ఎవడో నీకు తెలిసే వరకు శాశ్వతమైన సుఖం, శాంతి నీకు తెలియదు. నీకు నిరంతరం సుఖం, శాంతి కావాలంటే నీవు ఏమతస్థుడైనా నువ్వు ఎవరో నీవు తెలుసుకొని తీరాలి, ఇది రమణమహర్షి బోధ. మనందరం రోజూ నిద్రను చూస్తున్నాము. నిద్రలో ఎవడు ఉన్నాడో, ఇప్పడు జాగ్రదవస్థలో ఎవడు ఉన్నాడో, స్వప్నంలో వాడే ఉన్నాడు. ఈ మూడు పోయినప్పడు కూడా వాడే ఉంటాడు. నిద్రలో మనకు తెలియకపోయినా సుఖంగా ఉన్నాము. మెలుకువ వచ్చేసరికి సుఖంపోతోంది, శాంతి పోతోంది. మీ పొలము, డబ్బు, గౌరవం, దేవతలు, పుణ్యపాపాలు ఇవి ఏమీ నిద్రలో జ్ఞాపకం రావటం లేదు. వీటి గొడవ ఏమీ లేకుండా నిద్రలో మీకు సుఖం, శాంతి ఎక్కడ నుండి వస్తోంది? ఆనందం, శాంతి మీ లోపల నుండే వస్తోంది. మెలుకువ వచ్చేసరికి సడన్‌గా పొంగువచ్చినట్లు అశాంతి, దుఃఖం వచ్చేస్తుంది. మెలుకువ వచ్చేసరికి నీకు గౌరవం, డబ్బు, అధికారం ఇవి అన్నీ ఉన్నాయి. అన్నీ ఉన్నా అశాంతి ఎందుకు వస్తోంది? నిద్రలో ఇవి ఏమీ లేనప్పడు ఎందుకు శాంతిగా ఉన్నావు? మెలుకువ రాగానే మన కుటుంబ సభ్యులమీద, బంధువులమీద, ఆస్తుల మీద మమకారం వచ్చేస్తుంది, ఇవి నాది అనేబుద్ధి

వచ్చేస్తుంది. కొంతమంది ఎదుటివారు కష్టాలు పడుతూఉంటే వీరు ఆనందిస్తారు, సంతోషంగా చెప్పకొంటూ ఉంటారు, దానిని పైశాచిక ఆనందం అంటారు, వారు మనుషులు కాదు, మానవరూపంలో ఉన్న పిశాచులు. గాఢనిద్రలో అహంకారం, మమకారం లేకుండా ఎలా ఉంటున్నావో అలా జాగ్రదవస్థలో నువ్వు ఉండగలిగితే గాఢనిద్రలో తెలియక అనుభవించిన ఆనందం, ఇప్పడు తెలిసి అనుభవిస్తావు. అది నీ కడసారి జన్మ. ఆ ఆనందం నీకు దొరికినప్పడు ఆనందంకోసం, శాంతికోసం బజారులో వెతకవు. ఆత్మజ్ఞానం కోసం ఎవడైతే సాధన చేస్తున్నాడో వాడికి అది లభ్యమౌతుంది, సాధన లేకుండా సాధ్యము కాదు.

భగవాన్ కొండ దిగి వస్తూ ఉంటే వెనకాల ఒక భక్తుడు వస్తున్నాడు. భగవాన్ నెమ్మదిగా నడుస్తున్నారు, మనం తప్పించుకొని వెళితే బాగుండదని ఆయన కూడా నెమ్మదిగా నడుస్తున్నారు. భగవాన్ అన్నారు మీ నాన్నగారు అప్పడప్పడు కనిపిస్తున్నారు. నువ్వు దుబారా ఖర్చులు చేస్తున్నావని, అప్పలు కూడా చేస్తావని మీ నాన్నగారు చెప్పారు నీకు కలిగిఉంటే ఏదైనా ఒక రూపాయి ఇతరులకు పెట్టుకోవచ్చు అంతేగాని అప్పలుచేసి పాడైపోకూడదు అని భగవాన్ చెప్పారు. నిప్ప, అప్ప, విషం, ఈ మూడింటి విషయంలో జాగ్రత్తగా ఉండు అని చెప్పారు. పొయ్యిలో నిప్పలు తీసి గడ్డి ఉన్నచోట పడేస్తే ఒక్క నిప్పరవ్వ ఉన్నా గడ్డి అంతా అంటుకుపోతుంది, అంతేకాదు ఇల్లు కూడా అంటుకుపోతుంది. నిప్ప పూర్తిగా ఆరిపోవాలి, అందుచేత నిప్ప విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. నిప్ప అంతా ఆర్పివేసినా ఒక్క రవ్వ మిగిలి ఉంటే కొంపలంటుకు పోతాయి. నీకు లక్ష రూపాయలు అప్ప ఉంది అనుకో నువ్వు 90 వేలు తీర్చేసి, ఇంక పదివేలు మర్చిపోయావు అనుకో, అది మరల లక్ష రూపాయలు అయిపోతుంది. అందుచేత అప్ప విషయంలో జాగ్రత్తగా ఉండాలి. విషం విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. తినే ఆహారంలో విషం కొంత కలిసింది అనుకో వాంతులు, మోషన్స్ పట్టుకొంటాయి. విషం ఎక్కువ ఉంటే చనిపోతారు, అందువలన జాగ్రత్తగా ఉండాలి. నేను భగవాన్ మాట్లాడుకొన్నాము, భగవాన్‌తో నాకు పరిచయం ఉందని చెప్పటానికి ఈ మాటలు రాయటం లేదు. ఈ మూడు ముక్కలు మీరు కూడా నేర్చుకొంటే మీకు ఉపయోగపడతాయని వ్రాస్తున్నాను అన్నాడు ఆ భక్తుడు. మనం శాస్త్రాన్ని చదివేటప్పడు ఇష్టాయిష్టాలు పెట్టుకోకూడదు. మాకు నచ్చిన శ్లోకాలే చదువుతాము, నచ్చనివి చదవము అని అనుకోకూడదు. ఇష్టాలు, అయిష్టాలు పెట్టుకొంటే శాస్త్రాన్ని చదివినా అది మీకు అర్థంకాదు. కర్త ఈశ్వరుడు, బలం ఈశ్వరుడిది, మన అహంకారానికి బలం లేదు. ఈశ్వరుడి యొక్క ప్రణాళికను బట్టి ఈ సృష్టి అంతా నడుస్తోంది. ఒకోసారి మీరు కష్టపడి పని చేసినా ఫలితం రాదు, ఒకోసారి కష్టపడకపోయినా ఫలితం వచ్చేస్తుంది. అప్పడు ఎందుకు వచ్చిందో, ఇప్పడు ఎందుకు రాలేదో మనకు తెలియదు. అందుచేత మనం బెంగలు వదిలేయాలి, అంతా ఈశ్వరుడే చూసుకొంటాడు.

మనం మంచి చేసాము అనుకోండి, చేసి మర్చిపోవాలి. అలాగ మర్చిపోము అనుకోండి మనస్సు పెరిగిపోతుంది. మర్చిపోతే మనం చేసిన మంచి తాలుక ఫలం ఎప్పడు, ఎక్కడ, ఏ జన్మలో అనుసంధానం చేయాలో ఈశ్వరుడు చూసుకొంటాడు. భగవంతుడి స్వరూపం మోక్షం. భగవంతుడిని తెలుసుకోకుండా ఆయన స్వరూపమైన మోక్షం మనకు అందదు. నువ్వు మాట్లాడేమాట, చేసేపని, నీకు వచ్చే ఆలోచనలు అన్నీ మోక్షం పొందటానికి సహకరించేలా ఉండాలి. ఈ రకంగా జీవిస్తూ ఉంటే ఈ జన్మలోనే మోక్షం రాకపోయినా రాబోయే జన్మలో మోక్షం పొందటానికి తగిన పరిస్థితులు ఉన్న కుటుంబంలో జన్మింపచేస్తాడు. మనస్సు బయటకు పోవటానికి ప్రియం, అప్రియంలే కారణం. సాధ్యమైనంత వరకు ఈ ప్రియం, అప్రియంలు లేకుండా చూసుకొంటే మనస్సు అంతర్ముఖమవుతుంది. నీ హృదయంలో ఉన్న నిజమైన నేనుకు ఈ అబద్ధమైన నేను ప్రతిబింబము అన్నారు ఆచార్యులవారు. అద్దంలో మన మొఖం చూసుకొంటే మన మొఖం యొక్క ప్రతిబింబం కనిపిస్తుంది. అద్దం పగిలిపోతే ఆ ప్రతిబింబం ఏమౌతుంది? ఆ ప్రతిబింబం నీ మొఖంలో కలిసిపోతుంది. అలాగే నీ మనస్సు అనే తెర తెగిపోతే ఈ అబద్ధమైన నేను వెళ్ళి నిజమైన నేనులో కలిసిపోతుంది. భక్తి యోగం, కర్మయోగం, ధ్యానయోగం అని యోగాలు చాలా ఉన్నాయి. నీవు అహంకారాన్ని త్యాగం చేసావు అనుకో ఆ త్యాగానికి మించిన యోగం ఏదైనా ఉందా ఈ లోకంలో అన్నారు ఆచార్యులవారు. ఈ పూజ చేసుకోండి ఈ కోరిక నెరవేరుతుంది అని ఎవరైనా చెపితే మీకు ఇష్టంగా ఉంటుంది కాని ఆత్మజ్ఞాన సముపార్జనకోసం ఎవరూ ప్రయత్నం చేయటం లేదు కారణం దాని విలువ మనకు తెలియటంలేదు. మనకు చిత్తశుద్ధిలేదు అందుచేత నేను ఎవడను అనే విచారణ మనకు రావటం లేదు. ఏది పొందితే నిత్యంగా, సత్యంగా ఉంటుందో దాని తాలుక ఎరుక మనకులేదు.

వాడు పూర్వజన్మలో చేసిన పుణ్యపాపములను బట్టి పుణ్యం అదృష్టం కింద, పాపం దురదృష్టం కింద వస్తుంది. పుణ్యం అనుభవించేటప్పడు సంతోషం కలుగుతుంది, పాపం అనుభవించేటప్పడు వాడికి దుఃఖం కలుగుతుంది. ఆ సంతోషంగాని, ఆ దుఃఖంగాని వాడికి అంటకుండా చూసుకొంటే వాడు సాధకుడు అవుతాడు అన్నారు ఆచార్యులవారు. సర్వసాధారణంగా అసూయ వలన విమర్శలు చేస్తారు. అసూయల వలననే విమర్శలు చేస్తున్నామని వారికి తెలియదు. అసూయ మాటలు చెప్పేవారికి ఎంత దోషమో వినేవారికి కూడా అంతే దోషము. అక్కడికి ఎవరో స్వామి వస్తే వెళ్ళామండి, ఆయన భగవంతుడు లేడని చెపుతున్నారు అని భగవాన్‌తో అంటే వారు అలా చెప్పటం పొరపాటుకాదు, అక్కడకు మీరు వెళ్ళటం పొరపాటు. మీలో ఏదో బలహీనత ఉంది లేకపోతే మీరు అక్కడకు ఎందుకు చేరతారు. ఏగూటి పక్షులు ఆ గూటికి వెళతాయి. సాధకుడి లక్షణం ఏమిటి అంటే బయట గొడవలు బయటే వదిలేయాలి. రోడ్డు మీద దుమ్ము అంతా పోగుచేసి మీ ఇంట్లో పోసుకొంటారా?

మిమ్మల్ని ఎవరైనా పొగిడినా, ఎవరైనా విమర్శించినా అది లోపలకు తీసుకోకూడదు, దానిని లోపలకు తీసుకొంటే మీ లోపల విషం ప్రవేశిస్తుంది, మీరు చేసిన సాధన అంతా పాడైపోతుంది. మన శరీరానికి గాయం తగిలితే హాస్పటల్‌కు వెళ్ళి గాయం బాగుచేయించుకోవచ్చునుగాని మనస్సు పాడైపోతే హాస్పటల్‌లో బాగుచేయరు. ఎంతో సాధన చేస్తేగాని, గురువు అనుగ్రహం ఉంటేగాని, కాలం కలిసివస్తేగాని మనస్సుకు పడ్డగాయం తగ్గదు. నువ్వు పూజ చేస్తున్నావు, జపం చేస్తున్నావు, ధ్యానం చేస్తున్నావు కాని లక్ష్యం మోక్షం మీద ఉందా? సీత రూపంలో రాముడు ఉన్నాడు, రాముడి రూపంలో సీత ఉంది అన్నాడు వాల్మీకి అంటే ఇద్దరూ వేరుకాదు అని చెప్పటంకోసం అలా చెప్పాడు. పార్వతీ పరమేశ్వరులు వేరుకాదు, ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే.

బుద్ధిమంతుడికి మనం చిన్న ఉపకారం చేస్తే జీవితం పొడుగునా మనలను జ్ఞాపకం పెట్టుకొంటాడు. దుష్టులకు ఎన్ని ఉపకారాలు చేసినా అప్పటికప్పుడు మర్చిపోతారు. జరిగేది అంతా ఈశ్వరసంకల్పంతో జరుగుతుంది, దానితో నువ్వు రాజీపడలేనప్పుడు దుఃఖం వస్తుంది. జరిగేది జరగక మానదు, రానున్నది రాక మానదు. మీకు వచ్చే అదృష్టం ఉంటే ఎవరూ చెడగొట్టలేరు, వచ్చేస్తుంది అది ఈశ్వరాజ్ఞ. శక్తి ఈశ్వరుడిది. అటువంటి ఈశ్వరుడిని పూజించి, స్మరించి మీరు తరించండి. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని నీకు భక్తి కుదిరితే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వచ్చేస్తాయి. మీకు భౌతికమైన భోగాలు, భౌతికమైన భాగ్యాలు ఇవన్నీ వస్తే రావచ్చుగాని ఇంద్రియాలు, మనస్సు స్వాధీనంలోనికి రాకుండా ఆత్మజ్ఞానం కలుగదు. మన హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది, దాని గురించి శ్రవణం చేయాలి, మననం చేయాలి, దాని గురించి సమాచారం సేకరించాలి, అది ఆత్మ విద్య. జపధ్యానముల వలన ఏ ఫలితం వస్తుందో, గురువు వాక్యాన్ని అర్థం చేసుకోవటం వలన ఆ ఫలితం వస్తుంది. మీరు చదివిన వాక్యం, మీరు శ్రవణం చేసిన మాటలు మీ గుండెకు తాకాలి, మీ లోపల ఒక భాగం అవ్వాలి అని ఆచార్యులవారు చెప్పారు. అభ్యాస వైరాగ్యములు లేకుండా, తపస్సు లేకుండా ఇంద్రియాలు కాని, మనస్సుకాని అణగవు. అవి అణిగితేనేగాని లోపల ఉన్న ఈశ్వరుడు మనకు స్వరూపంగా వ్యక్తంకాడు. ఏకాంతవాసం, మౌనం ఈ రెండూ మనోనిగ్రహానికి సహకరిస్తాయి. మనం ఇంటి దగ్గర ఎక్కువ మాట్లాడకూడదు. అవసరమైనప్పుడు మాట్లాడాలి. ఇంటి దగ్గర ఒకటి, రెండు గంటలు నోరు కట్టుకోవటం మంచిది. ఎక్కువ మాట్లాడేవారికి సమాజంలో గౌరవం ఉండదు. మనకు మాట అణగదు అనుకోండి, ఇంద్రియాలు అణగవు అనుకోండి, మనస్సు అణగదు అనుకోండి ఆత్మజ్ఞానం ఎరుకలోనికి రాదు. మనకు బలమైన వాసన ఉంది అనుకోండి, అది ఒక్కటే నిజం అనిపిస్తుంది. ఆ వాసనలో నుండి బయటకు రావటానికి భగవంతుడిని ప్రార్థించటం, దానికి వ్యతిరేకమైనవి మనం ప్రాక్టీసు చేస్తే నెమ్మదిగా అది పల్చబడిపోతుంది. ఆ బలహీనతలు ఒకప్పుడు మంచివి అని నేర్చుకొన్నాము, ఇప్పుడు చెడ్డవని మనకు అర్థమవుతోంది.

వాటిని విడిచిపెట్టేటప్పుడు కష్టమవుతోంది.

మనం నోటితో తినే ఆహారం శుభ్రంగా ఉందో లేదో చూసుకొంటాము. చెవులతో వినే విషయాల పట్ల జాగ్రత్త పడము, కళ్ళతోచూసే విషయాలపట్ల మనం జాగ్రత్త పడము. నోటితో తీసుకొనే ఆహారం కంటే చెవులతో, కళ్ళతో తీసుకొనే ఆహారం పట్ల ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. అదీ ఆహారమే అని తెలియకపోవటం వలన అజాగ్రత్తగా ఉంటున్నాము. నేను తినేది మాత్రమే కాదు, నేను వినేది చూసేది కూడా శుచిగా ఉండేటట్లు నన్ను అనుగ్రహించు అని ఒక వేదంలో ప్రార్థించాడు. మనం ముందు ప్రపంచాన్ని పెడుతున్నాము. తరువాత ఖాళీగా ఉన్నప్పుడు భగవంతుడిని స్మరించుకోవచ్చు అనుకొంటున్నాము. భగవంతుడిని స్మరించటంవలన పవిత్రులం అవుతాము అన్న సంగతి తెలియక స్మరణలో అశ్రద్ధ చేస్తున్నాము. గోపికలది కోరికలేని భక్తి, కోరికలేని ప్రేమ, కోరికలేని ఆప్యాయత. మనకు సమాజం అంటే ఎంతోకొంత భయం ఉంటుంది. పరమాత్మకోసం సామాజిక గౌరవం, కుటుంబ గౌరవం కూడా వదిలిపెట్టి పరమాత్మ వెనకాల పరుగెట్టారు, వారు గోపికలు. పూర్వపుణ్యం ఉంటేనేగాని, గురువు అనుగ్రహం ఉంటే గాని ఈశ్వరుడిపట్ల అంత ప్రేమకలగటం సాధ్యంకాదు. నువ్వు ఏ పని చేసినా ఈశ్వరార్పణగా చేస్తున్నావు అనుకో మోక్షం దగ్గరకు నీవు వెళ్ళనక్కరలేదు, మోక్షమే నీ దగ్గరకు వస్తుంది. మనకు ఎల్లయ్య ఎల్లయ్యలాగ, పుల్లయ్య పుల్లయ్యలాగ కనిపిస్తున్నారు మరి రాధ అందరిలోను కృష్ణుడినే చూస్తోంది కదా అంటే కృష్ణుడు అనే కాటుకను కళ్ళకు రాసుకొని చూస్తోంది అందుచేత అంతా కృష్ణమయమే. భగవంతుడిపట్ల ఆపుకోలేని ప్రేమ కలుగుతూ ఉంటే, ఆ ప్రేమప్రవాహంలో అహంకారం కొట్టుకొనిపోతుంది. మీరు లోపల ఉన్నారు అనుకొంటున్నారు కదా. మీరు లోపల ఆత్మగా ఉన్నారా, వ్యక్తిగా ఉన్నారా? మీరు వ్యక్తిగానే ఉన్నారు, ఆ వ్యక్తిగా ఉండటమే అహంకారం. అది పడిపోకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు.

సూర్యుడు ఉదయిస్తేగాని చీకటి పోదు అలాగే జ్ఞానసూర్యుడు ఉదయిస్తేగాని అజ్ఞానం బయటకు పోదు. నీకు ఒకోసారి సంతోషం వస్తుంది, ఒకోసారి దుఃఖం వస్తుంది, ఒకోసారి లాభం, ఒకోసారి నష్టం వస్తుంది, ఈ హెచ్చుతగ్గులు అన్నీ నీకే, ఇవన్నీ మేఘాలు. ఈ మేఘాలు ఉన్నంతకాలం జ్ఞానసూర్యుడు నీకు కనబడడు. మనకు నిద్రలో అహంకారం లేదు. పది గంటలు నిద్రపోతే పది క్షణాల కింద వెళ్ళిపోతుంది. పగలు పదిక్షణాలు పది గంటల కింద వెళు తుంది, కారణం అహంకారంలో టైము ఉంది, అహంకారం ఎక్కడైతే లేదో అక్కడ టైము లేదు. భగవంతుడు నీకు తెలిసినా తెలియకపోయినా అసలు మన హృదయంలో భగవంతుడు అనే వాడు అంతర్యామిగా ఉన్నాడని కనీసం నమ్మకం లేకపోతే ఆయన ఎందుకు తెలియబడతాడు. నేను మీకు ఈ మాటలు చెప్పటం వలన భగవదనుభవం వచ్చేయదు. కాని ఇలా పదిసార్లు మీ హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు అని చెప్పటం వలన ఉన్నాడని అనుకోవటం వలన

మీకు విశ్వాసం కలుగుతుంది, ఆ విశ్వాసం మీకు భగవదనుభవం కలగటానికి సహకరిస్తుంది, అందుకు రిపీటెడ్‌గా చెప్పటం. కాలమనే సర్పము మనలను కాటువేయక ముందే మనం జ్ఞానం సంపాదించాలి. అలా జ్ఞానం సంపాదించ లేదు అనుకోండి ఏ లోకంలోనికి వెళ్ళిపోతామో, ఏ కుటుంబంలోనికి వెళ్ళిపోతామో, మనకు ఎటువంటి జన్మ వస్తుందో మనకు తెలియదు.

ఒకే స్త్రీని ఒకడు భార్య అంటాడు, ఒకడు అమ్మ అంటాడు, ఒకడు మేనత్త అంటాడు, ఒకడు పిన్నమ్మ అంటాడు. ఆ స్త్రీని ఎవడి కోణంలో నుండి వాడు చూసి అలా అంటున్నారు. ఇంతకూ ఆ స్త్రీ అమ్మా, భార్యా, మేనత్తా లేక పిన్నమ్మా అని భగవాన్ అడుగుతున్నారు. ఇటువంటివి చెప్పేటప్పడు భగవాన్ నిర్మోహమాటంగా మాట్లాడతారు. మనకు మోహం తగ్గటానికి సబ్జక్టు మనకు ఎదురుగుండా పెట్టేస్తారు. ఇంట్లోవారి కోసం రూపాయికి 90 పైసలు ఖర్చుపెడుతూ ఉంటే, నువ్వు మోహం లేకుండా, ఏమీ ఆశించకుండా పని పనికోసమే 10 పైసలు ఖర్చు పెట్టలేవా అంటున్నారు. రూపాయికి రూపాయి నీ ఇంట్లో వారే తినేయాలా? వారి వల్ల నీకు ఏమైనా వస్తుందా? ఏమీ రాదు. భగవంతుడి ప్రీత్యర్థం ఏదైనా పనిచేస్తే అది భగవంతుడి ఎక్కౌంట్ లోనికి వెళుతుంది, అది మరణానంతరం నీకు ఉపయోగపడుతుంది. ఇక్కడ ఎక్కౌంటులో ఉన్న డబ్బు మరణానంతరం నీకు చెల్లదు. నువ్వు ఎవరికైనా ఉపకారం చేసినా, అపకారం చేసినా ఇది అంతా నా వల్లే అవుతోంది అనుకొని చేయటం వలన నీకు పుణ్యపాపాలు అంటుతున్నాయి. నేను కర్తను కాదు, ఈశ్వరుడే కర్త అని నోటితో చెప్పటంకాదు, లోపల ఆ భావనాబలం ఉంటే నీకు పుణ్యపాపములు అంటవు. ఒక్క ఆత్మ జ్ఞాని తప్పించి, నేను కర్తను కాదు అని ఎవడూ పనిచేయలేడు. నీవు జీవుడై చేస్తే పుణ్యం ఉంది, పాపం ఉంది. నీవు దేవుడై చేస్తే పుణ్యం లేదు, పాపం లేదు, ఒకవేళ వెనకాల ఏదైనా ఉంటే అదికూడా రాలిపోతుంది, నీవు ప్రత్యేకం విడిచిపెట్టనక్కరలేదు. 105 డిగ్రీల జ్వరంతో ఉన్నప్పడు వాడి నోటిలో పాయసం పోసినా అది చేదుగా ఉంటుంది. అలాగే మనం అజ్ఞానం అనే జ్వరంతో కాలిపోతున్నప్పడు, మమకారం అనే జ్వరంతో కాలిపోతున్నప్పడు భగవంతుడు చెప్పిన మాటల యొక్క విలువ మనకు తెలియదు. చిత్తశుద్ధి లేకపోతే ఈశ్వరుడి పట్ల మనకు ప్రేమరాదు, అసలు మనకు జిజ్ఞాస కలుగదు. మనం ఒక పనిని క్రమంగా చేస్తే అది ఫలిస్తుంది, క్రమం విడిచిపెట్టేస్తే అది ఫలించదు, నువ్వు చాలా విషయాల గురించి చెప్పావు మరి మేము తరించే మాటలు చెప్పవా అని ధర్మరాజు భీష్ముడిని అడిగితే అప్పడు విష్ణుసహస్రనామాలు చెప్పి ఇది పారాయణ చేసుకోండి. మీరు తరిస్తారు అని చెప్పాడు.

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | | |
|---|---|---|
| మార్చి | 6 | చించినాడ, శివరాత్రి |
| మార్చి | 9 | గుండుగొలను |
| మార్చి | 11 | లక్కవరం, సరస్వతి శిశుమందిర్ మ॥ 3-00లకు |
| మార్చి 14 నుండి 26 వరకు అరుణాచలం క్యాంపు | | |
| మార్చి | 31 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| ఏప్రియల్ | 6 | ఖండవల్లి |

# పుస్తక సమీక్ష

శ్రీ యం. శివరామకృష్ణ గారిచే తెలుగునుండి ఆంగ్లమునకు అనువదింపబడి, సద్గురువు శ్రీ నాన్నగారి ప్రవచనాల సారమైన "అమృతవాక్కులు - మనస్సును శాంతింపజేసే సాధన" అను పుస్తకముపై శ్రీ బాలసుబ్రహ్మణియన్ గారిచే 'తత్త్వలోక' ఫిబ్రవరి 2008 మాసపత్రికలో ప్రచురించ బడిన ఆంగ్ల సమీక్షకు ఆంధ్రానువాదము.

పైన పేర్కొనబడిన పుస్తకము శ్రీ నాన్నగారి ప్రవచనాల సారమైన అమృతవాహిని పుస్తకము నకు ఆంగ్లానువాదము. ఆంధ్రప్రదేశ్‌లో ఒక సంపన్న కుటుంబములో జన్మించిన శ్రీ నాన్నగారు స్వప్నములో భగవాన్ శ్రీ రమణమహర్షిచే ఆశీర్వదించబడి, అప్పటినుండి భగవాన్ శ్రీరమణమహర్షి భక్తునిగా అనేకసార్లు అరుణాచలమును సందర్శించారు. ఒక సందర్భములో అరుణాచలంలో శ్రీ నాన్నగారి "మనస్సు హృదయంలో లయించి తన ఉనికిని కోల్పోవుట జరిగినది".

అనేక ప్రాంతాలలో, అనేక సందర్భాలలో భక్తులకు ప్రవచనాల ద్వారా బోధింపబడిన సందేశాన్ని అంశముల వారీగా సమీకరించుట జరిగినది, అట్టివాటిలో 'సాధన-రహస్యములు' ఒక అంశము. అత్యంత సరళము, శక్తివంతము అయిన శ్రీ నాన్నగారి ప్రవచనాలు పాండిత్య సంబంధమైనవి కాక, అంతరానుభూతి నుండి జాలువారినవే! అతిసామాన్యమైన ఉదాహరణలతో సరళమైన భాషలో స్పష్టముగా పొందుపరచబడిన బోధసూటిగా అంతిమసత్యంలోకి మేల్కొలిపేదిగా ఉంది. ఈ పుస్తకములోని ప్రవచనాల సారం ఆధ్యాత్మిక సాధకులకు అత్యంత ఉపయోగకరముగా ఉన్నవి. సాధనలో ముఖ్య ఆటంకము 'చంచల మనస్సు'. అనేకజన్మల నుండి ప్రోగుచేసుకున్న సంస్కారములచే బహిర్ముఖమైన అట్టి మనస్సును ఏకచింతనకు అలవాటు చేసి, తద్వారా నశింపజెయ్యడం క్లిష్టమైన సాధనే అయినప్పటికీ, నిరంతర అభ్యాస, వైరాగ్యములచేత మనస్సును అతిక్రమించవచ్చునని శోకతప్తుడైన అర్జునుడికి శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో బోధించాడు. క్లిష్టమైన యోగ సాధనల కన్న పరమాత్మ పట్ల సజీవ విశ్వాసము, నిర్మల భక్తి, ప్రేమతో జ్ఞానప్రాప్తి కలుగుతుంది. భగవాన్ శ్రీరమణమహర్షి, శ్రీ రామకృష్ణపరమహంసల బోధలు ఆచరణకు అనువుగా సులభమైన రీతిలో పొందుపరచబడినవి. ఆధ్యాత్మికమార్గములో సాధకులకు అనేక సందర్భాలలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారములు స్పష్టముగా సూచించబడిన ఈ పుస్తకము అత్యంత విలువైనది.

అనువాదం : **చావలి సూర్యనారాయణమూర్తి**, టీచర్, అమలాపురం

# వేరుచేసేది అహంభావన - ఐక్యం చేసేది ఆత్మభావన

చైతన్యాన్ని పరిమితం చేసే అంశాలు సంస్కారాలు, వాటితో నిర్మితమైన పరిమితి కట్టడమే అహంకారం. తాను దేహమనే అసత్య భావన మూలంగా అహంకారం భ్రాంతికి ఆధారమౌతుంది. ఇతర జీవులు తనకన్న వేరు అని భావిస్తుంది. దీని నాశనం సత్యానుభవంతో పరిసమాప్తమౌతుంది. నిత్య జీవితంలో మన కుటుంబ సభ్యులను మనం ఎలా ప్రేమిస్తామో అలాగే సత్యాన్ని తల్లిగాను, జ్ఞానాన్ని తండ్రిగాను, ధర్మాన్ని సోదరుడిగాను, దయను గురువుగాను, శాంతిని మిత్రునిగాను, క్షమను సోదరిలాగా ప్రేమించాలి. అలా జీవించకపోతే మనకు ఇష్టంకాని వ్యక్తి, పరిస్థితులుగాని ఎదురైనప్పడు. మనలో ఉండే క్రోధ సంస్కారం సహజంగా వేరుభావనతో మనం క్రోధానికి గురియై ఊగిపోతాము. ఆత్మజ్ఞానంలో ఉన్నప్పడు మన కోపం ఎదుటివానిపై కాక మన సంస్కారాలపైనే దృష్టిపడి వాటిపైనే కోపపడితే అవి రహితమైపోతాయి. అంతా నేనే అందరూ నేనే అనే భావం వల్ల తత్సంబంధమైన వారు అంతా ప్రయోజనం పొందుతారు. ఇన్నాళ్ళు మనం అహంభావననే సత్యమని భావించి దుఃఖానికి బలి అయ్యాము, ఇప్పడు శాశ్వతమైన ఆత్మ నేను అనే ఆలోచన నాటుకొంటే పరమానందం అందుతుంది. జ్ఞాని ఈ ఐక్య భావనతో ఎటుచూచినా తానే అని పరమానందంతో ఉంటాడు. మనకు రవ్వంత స్వార్థం ఉంటే చాలు ఇతరుల వాసనలను అనుసరించటానికి సిద్ధం చేస్తుంది. అజ్ఞానం మనిషిని నడుపుతుంది. భయం మనిషిని పాడుచేస్తుంది. గత తప్పిదాలను తలచుకొని వర్తమాన భవిష్యత్తులను పాడుచేసుకొంటున్నాము. శ్రద్ధ వల్ల భవిష్యత్తు బంగారమౌతుంది. కబీర్ "తెలివిగలవాడు ఈ ప్రపంచాన్ని సృష్టించాడు అందులో నీవు భాగమే దాన్ని ఆయన రక్షించుకోగలడు అనే విశ్వాసం నీకు ఉండాలి గురువు ఎవరిని మేలుకొలుపునో వాడు బాగుపడతాడు. సద్గురువు నీకు అన్ని ఇస్తాడు అతనికి నీవు ఏమీ ఇయ్యవలసినవి లేదు" అన్నారు. ఈ అహంభావన తన పుట్టినిల్లు అయిన ఆత్మలో ఉండక మెట్టినిల్లు అయిన శిరస్సులో ఉంటూ నిలకడలేక అన్ని జాతులతో కలుస్తూ అమంగళంగా కలకాలం జీవిస్తుంది. శ్రీ నాన్నగారు "అహంభావన పనసపొట్టు నరికినట్లు దేశమని, కాలమని, నీవని, నేను అని నరుక్కుపోతుంది ఐక్యతలో ఉన్న ఆనందం దానికి తెలియదు" అన్నారు. కాబట్టి కల్పవృక్షమైన ఆత్మ నీడలో జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు,** అర్థవరం